శ్రవణ సహిత దృశ్యరూపకమే నాటకం. జానపద కళలు విలసిల్లుతున్న కాలంలో ప్రజలకు మరింత చేరు వైన నాటకాలు... విజ్ఞానాన్ని, వినోదాన్ని అందించాయి. గ్రామాల్లో అక్షరాస్యత లేకపోయినా, భాష ఉన్నతిని కాపాడిన ఘనత నాటకాలకు దక్కుతుంది. ఒకప్పుడు అనేక నాటకాల ద్వారా ఎన్నో పద్యాలు... చదువుతో సంబంధం లేకుండా ప్రజల నాల్కల మీద నడయాడాయి. నా చిన్నతనంలో మా గ్రామంలో వివిధ పండుగ సందర్భాల్లో అనేక నాటకాలను చూసిన గుర్తు ఉంది.

జీవితసత్యాలను తెలియజేసే నాటక పద్యాలు మా గ్రామంలో ప్రతి ఒక్కరికీ నాల్కల మీద ఉండేవి. చక్కని ఉచ్చారణతో వారు పద్యాలు పాడుతుంటే ఆనందం కలిగేది. వినోద సాధనాలు ఇంతగా ప్రజల మధ్యకు రాక ముందు నాటకాలే ఆ బాధ్యతను తీసుకున్నాయి.

సత్యహరిశ్చంద్రలాంటి నాటకాలు సత్యం గొప్పతనాన్ని తెలియజేస్తే, బ్రహ్మంగారి నాటకాల వంటివి నాటి సమాజంలోని వివక్షలను ప్రశ్నించాయి. నాటకం ఈ నాటిది కాదు. జానపద సాహిత్య కాలం నుంచి నాటకం వైభవోపేతంగా వెలిగింది. నన్నయ సైతం తన మహాభారత అవతారికలో... రసాన్విత కావ్య నాటకముల్ పెక్కు జూచితి... అని తెలియజేశారు. ఇది తెలుగు నాటక ప్రాచీనతను మనకు తెలియజేస్తుంది. మారే కాలంతోపాటే మరెన్నో మార్పులు...



ఇంకెన్నో ఆవిష్కరణలు చోటు చేసుకుంటూ ఉంటాయి. ఈ నేపథ్యంలో మార్పును స్వాగతించడంతో పాటు, మంచి మార్పును తరతరాలకు నిలబెట్టుకోవలసిన అవసరం ఉంది. తెలుగు నాటకం కూడా అలాంటిదే. తెలుగు సాహిత్య విమర్శ తర్వాత తెలుగు నాటకం పుట్టింది అంటూ ఉంటారు. 1860లలో నాటక ప్రక్రియ మొదలైనట్లు భావిస్తారు. అంతకు ముందు పద్యనాటకాలు, సంస్కృత నాటకాల ప్రభావం ఎక్కువగా ఉండేది.

1880 నుంచి 2020 మధ్య 140 సంవత్సరాల్లో 100మంది రచయితల కలం నుంచి జాలువారిన 100 ప్రసిద్ధ నాటకాలను ప్రచురణల రూపంలో తీసుకురావడం నిజంగా అభినందించదగిన అంశం. నాటకరంగం సమస్యలు ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో 100 నాటకాలను పుస్తకాల రూపంలో తీసుకొచ్చేందుకు చేసిన ఈ ప్రయత్నం, తెలుగు నాటక వికాసానికి నూతన బాటలు వేయగలదని భావిస్తున్నాను.

మనిషి తన భావాలను వివిధ సాహిత్యప్రక్రియల రూపంలో సమాజంతో పంచుకుంటాడు. ఇవి ఎక్కువ మందికి చేరడానికి, సామాజిక మార్పునకు దోహదపడేందుకు పత్రికలు, గ్రంథాల ప్రచురణ ఎంతగానో తోడ్పడింది. రచనలు భావితరాలకు స్ఫూర్తిదాయకంగా అందాలంటే అవి గ్రంథాలుగా రావడం ఎంతో ఆవశ్యకం. వేటికవే కాకుండా, సంఘటితంగా వచ్చే ఇలాంటి ప్రచురణలు దిశను, దశను నిర్దేశించగలవు.

నాటకరంగానికి సంబంధించి సింహావలోకనం చేసుకోవలసిన తరుణం ఆసన్నమైంది. సినిమా వచ్చాక నాటకం బలహీనపడిందనేది చాలామంది మాట. కానీ దానితో నేను ఏకీభవించను. సినిమాతో సమానంగా నాటకం దాని ప్రాధాన్యతను నిలబెట్టుకోవాలనేదే నా ఆకాంక్ష. ప్రస్తుతం సమాజాన్ని ప్రతిబింబిస్తూ, ప్రేక్షకుల నాడి పట్టుకున్న కళలకు ఆదరణ ఎప్పుడూ ఉంటుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ప్రక్రియ మారుతూ రావాలి.

స్వరాజ్య ఉద్యమకాలంలో ప్రజల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని బలంగా నాటేందుకు నాటకాలు ఎంతగానో కృషిచేశాయి. ఎన్నో ప్రజా ఉద్యమాలు సైతం ఊపందుకోవడానికి నాటకాలు ఎంతో తోడ్పడ్డాయి. అలాంటి నాటకం సినిమా ప్రభావంతో ప్రజలకు

దూరమైంది అన్నది ఓ అభిప్రాయం మాత్రమే.

మహాత్మగాంధీని సైతం నాటకం ఎంతో ప్రభావితం చేసింది. ఆయన చిన్న తనంలో చూసిన సత్యహరిశ్చంద్ర నాటకం, సత్యనిష్ఠ గొప్పతనాన్ని గాంధీకి తెలియజేసిన విషయం మనందరికీ తెలిసిందే. తండ్రి జేబులో డబ్బులు దొంగిలించి, మళ్లీ తన తప్పు తెలుసుకుని, తండ్రికి నిజం చెప్పి, ఆయన మనసుకున్న గెలుచుకున్న విషయం గాంధీజీ ఆత్మకథలో మనకు కనిపిస్తాయి. ఈ ఒక్క సందర్భం చాలు కదా... నాటకాలు సమాజాన్ని సానుకూల మార్గంలో ఎలా ప్రభావితం చేశాయో చెప్పడానికి.



కన్యాశుల్కం, వరకట్నం, లింగ వివక్ష వంటివి సమాజ అభివృద్ధిని ఎలా వెనుక్కునెడుతున్నాయో అనేక నాటకాలు తెలియజేశాయి. రాజకీయరంగంలోని అనారోగ్య ధోరణులను ప్రశ్నించిన నాటకాలు ఎన్నో.

భారతీయ కుటుంబవ్యవస్థ గొప్పతనాన్ని తెలియజేస్తూ, తల్లిదండ్రులు నిరాదరణకు గురౌతున్న వాస్తవాలను ప్రతిబింబిస్తూ... ఆదివాసీల జీవితాలను ఆవిష్కరిస్తూ... చేనేత కార్మికుల కష్టాలను కళ్లకు కడుతూ... అనేక సామాజికాంశాలు నాటకాలుగా సమాజానికి దిశానిర్దేశం చేశాయి. ఇవేగాక ఛత్రపతి శివాజి, అల్లూరి సీతారామరాజు, కందుకూరి వీరేశలింగం, టంగుటూరి ప్రకాశంపంతులు, కన్నెగంటి హనుమంతు వంటి నాయకుల జీవితాలను ప్రతిబింబించే నాటకాలకు కొదవలేదు. నాడు ఎన్నో నాటకాలను బ్రిటీష్ ప్రభుత్వం నిషేధించిందంటేనే తెలుస్తోంది కదా... నాటక ప్రభావం ప్రజల మీద ఎంత ఉందో.

భారతీయ సమాజాన్ని పట్టి పీడిస్తున్న అనేక వివక్షలను నాటకం ఎండగట్టింది. ముఖ్యంగా సామాజిక వివక్షలకు వ్యతిరేకంగా నాటకం ఓ ఉద్యమమే చేసిందని చెప్పుకోవాలి.

స్వచ్ఛభారత్‌లాంటి ఉద్యమాలు ప్రజలకు మరింత చేరువ కావడంలో నాటక కళాకారులు, జానపద కళాకారులు పోషించిన పాత్ర మరువలేనిది. అదే విధంగా కోవిడ్ సమయంలోనూ ప్రజలకు అవగాహన కల్పించడంలో వారు కీలకపాత్ర పోషించారు.

ఈ పుస్తకాల రూపంలో ఈ నాటకాలను అధ్యయనం చేసే అవకాశం ముందు తరాలకు కలుగుతుందని భావిస్తున్నాను. దీనిద్వారా సమాజంలో వస్తున్న మార్పుల ద్వారా అనేక విషయాలు గ్రహించవచ్చని నా నిశ్చితాభిప్రాయం.

నాటక ప్రక్రియను ముందు తరాలకు అందించిన వారిలో నిరక్షరాస్యులు ఎక్కువగా ఉండడం, కాలగమనంలో క్రమంగా ఆదరణ కోల్పోవడం లాంటి కారణాలవల్ల నాటకంమీద పరిశోధనలు పెద్దగా జరగలేదనే చెప్పాలి. నాటకరంగం అభివృద్ధి కోసం మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా యువతరం ప్రాచీన నాటకాలను, ఆధునికకాలానికి ఎలా అన్వయించవచ్చనే విషయాన్ని అవగతం చేసుకుని ఆచరణలో పెట్టాలి. ఈతరం యువత నాటి పరిస్థితుల గురించి తెలుసుకోవడానికి, భాషను సంరక్షించుకోవడానికి, మన గత వైభవాన్ని నెమరువేసుకోవడానికి, భవిష్యత్ తరాలకు అందించడానికి ఇలాంటి పుస్తకాలు ఎంతగానో తోడ్పడతాయి. ఈ సంకలనాల్లోని వంద నాటకాలను ఒక్కసారి పరిశీలించి చూస్తే, నాటి సమాజానికి తగిన విధంగా నాటకం ఎలా మారుతూ వచ్చిందో అవగతమౌతుంది.

నాటకాన్ని ఒకప్పుడు రాజులు, జమీందార్లు ప్రోత్సహించారు. తదనంతర కాలంలో నాటకాభిమానులు,

ప్రజలే పోషకులయ్యారు. ఎలాంటి వ్యాపారదృష్టి లేకుండా సమాజహితం కోరే నాటకానికి నేడు ఆదరణ కొరవడిందనేది నిర్వివాదాంశం. సినిమాలతో పోటీపడి నాటకాలు ప్రేక్షకులకు మరింత చేరువ కావాలంటే ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. అందు కోసం నాటక సమాజాల ఖర్చు పెట్టే పరిస్థితుల్లో లేవు.

ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు నాటక రంగానికి చేయూతను ఇవ్వాలి. ముఖ్యంగా నాటక ప్రదర్శనలకు అనువైన వేదికలను ప్రతి జిల్లా కేంద్రాల్లోనూ, పెద్ద పెద్ద పట్టణాల్లోనూ ఏర్పాటుచేయడం అత్యంత ఆవశ్యకం. ప్రభుత్వాలే కాకుండా, ప్రైవేట్ సంస్థలు, ఆధ్యాత్మిక సంస్థలు నాటకరంగానికి ప్రోత్సాహం ఇచ్చేందుకు ముందుకు రావాలి. ముఖ్యంగా ప్రైవేట్ టీవీ ఛానెళ్లు నాటకాలకు ప్రోత్సాహం అందించే ప్రయత్నాలు చేయాలి.

పాఠశాలలు, కళాశాలలు సైతం పిల్లలకు విద్యతో పాటు, సాంస్కృతిక కార్యక్రమాల దిశగా ప్రోత్సాహం అందించాలి. దీని ద్వారా వారిలో సమాజంపట్ల అవగాహనతోపాటు, నాయకత్వ లక్షణాలు అలవడుతాయి.

రచయితలు సైతం సమకాలీన సమాజాన్ని, సమస్యల్ని, సంక్లిష్టతలను, వైరుధ్యాలను అర్థం చేసుకుంటూ సామాజిక చైతన్యాన్ని కలిగించే రచనలతో ముందుకు రావాలి. ముఖ్యంగా హింస, దౌర్జన్యాలు, ఉగ్రవాదంలాంటి వాటిపట్ల నిరంతరం ప్రజల్ని అప్రమత్తం చేస్తూ ఉండాలి. భాష విషయంలో సైతం నాటకాలు ప్రజలకు మరింత చేరువ కావలసిన అవసరం ఉంది.

యువతరం సైతం సినిమా, టీవీలకు ఇస్తున్న ప్రాధాన్యత నాటకాలకు కూడా ఇవ్వాలి. సినిమా, టీవీ రంగాల్లో పని చేయాలనుకునే యువతరం కొంత కాలం నాటకాల్లో పని చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ చొరవ నాటకరంగానికేగాక, తెలుగు సినిమా... టీవీ రంగాలకు సైతం ఎంతగానో ఉపయోగపడుతుంది. సామాజిక హితాన్ని కాంక్షించే దిశగా నాటకాలను నిలబెట్టుకోవడంలో మరింత సహాయపడుతుంది.

అదే విధంగా సినీ ప్రముఖులు సైతం నాటకాలను ఆదుకునేందుకు ముందుకు రావాలి. మంచి నాటకాలను ప్రోత్సహించాలి. దీని ద్వారా నూతన నటులు పరిచయం కావడంతోపాటు, ప్రతిభ ఉన్న వారికి అవకాశాలు అందుతాయి. నాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా ఎంతోమంది నటులు, రచయితలు, సంగీత కళాకారులు, నృత్య కళాకారులకు సహా ఈ రంగానికి చెందిన అనేకమందికి ఉపాధి లభిస్తుంది.

తెలుగు సమాజ పరిణామా లతో పాటు తెలుగు నాటకం తాను మారుతూ, సమాజం మారడానికి, సమాజాన్ని మార్చడానికి కృషి చేస్తున్నదని ఈ సంకలనాలు రుజువు చేస్తున్నాయి.




అనేక భావజాలాలకు, అనేక సామాజిక ఉద్యమాలకు స్పందించడం, ఎప్పటికప్పుడు సామాజిక వాస్తవికతను విమర్శనాత్మకంగా ప్రతిబింబించడం ఈ నాటకాల్లో మనకు కనపడుతుంది.

ఈ వంద నాటకాలు నిస్సందేహంగా ఒకటిన్నర శతాబ్దం సమాజ చరిత్ర రచనకు విశ్వసనీయమైన ఆధారాలుగా నిలుస్తాయని భావిస్తున్నాను. ఎన్నో సంవత్సరాలుగా కృషిచేసి ఈ సంకలనాలను తీసుకొచ్చిన శ్రీ వల్లూరు శివప్రసాద్‌గారికి, శ్రీ గంగోత్రి సాయిగారికి ప్రత్యేకంగా అభినందనలు.

భాష ఉన్నతికి చిరునామాగా, సామాజిక హితాన్ని కాంక్షిస్తూ, ప్రజలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని పంచే నాటకాలకు పూర్వవైభవం రావాలని ఆకాంక్షిస్తున్నాను.

జై హింద్...

# తానా-మంచి పుస్తకం
## బాలల పుస్తకాల ఆవిష్కరణ







పిల్లలలో పఠనాసక్తిని, పుస్తకాలు చదవటాన్ని, పుస్తకాల పట్ల ఇష్టతని పెంపొందించే ఉద్దేశంతోనూ పిల్లల కోసం రాసే రచయితలను ప్రోత్సహించటం కోసమూ తానా-మంచి పుస్తకం సంయుక్తంగా 2017 నుంచి పిల్లల బొమ్మలు కథలు, నవలల పోటీని ప్రతి రెండేళ్లకు ఒకసారి నిర్వహిస్తున్నారు. తానా పూర్వ అధ్యక్షులు జంపాల చౌదరి పూనికతో ఈ పోటీ నిర్వహణ నిర్విఘ్నంగా సాగుతోంది. ఈ సంవత్సరం నిర్వహించిన పోటీలలో ఐదు నవలలకు, పది పిల్లల బొమ్మల కథలకు బహుమతులు ప్రకటించి, ఆ పుస్తకాలను ప్రచురించారు.

నవంబర్ 14న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ పిల్లల బొమ్మల కథలు, నవలల ఆవిష్కరణ, బహుమతి ప్రదాన కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమానికి కథాసాహితి సంపాదకులు వాసిరెడ్డి నవీన్ స్వాగతం పలుకుతూ, పిల్లల బొమ్మల కథలు, నవలలకు తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. తానా-మంచి పుస్తకం సంస్థల ఆధ్వర్యంలో పిల్లలకు సంబంధించిన 15 పుస్తకాలను ఒకేసారి విడుదల చేయడం గొప్ప విషయమని, ఇందులో చిన్నపిల్లలు రాసిన పుస్తకాలు కూడా ఉన్నాయన్నారు. వీటిని తల్లిదండ్రులు తమ పిల్లలతో చదివించాలన్నారు. పోటీలో పాల్గొన్న రచయితలకు, రచనలకు బొమ్మలు వేసిన చిత్రకారులకు తానా తరపున కృతజ్ఞతలు తెలిపారు.

పుస్తకాలను ఆవిష్కరించిన రచయిత, నటుడు డా॥ యం. భూపాల్ ఉపాధ్యాయులు పిల్లల స్థాయికి తగిన కథలు, పాఠాలు చెప్పాలని సూచించారు. అప్పుడే వారు మంచి పౌరులుగా ఎదుగుతారన్నారు.

బొమ్మల కథల పుస్తకాలను పరిచయం చేసిన టీచర్, ఎడ్యుకేటర్ వి.ఎస్. పవిత్ర మాట్లాడుతూ పిల్లల పుస్తకాల్లో జానపద కళలు, పగటి వేషగాళ్లు, పిట్టల దొర తదితర బొమ్మల కథలు చాలా బాగున్నాయన్నారు.

కేంద్ర సాహిత్య అకాడెమి బాలసాహిత్య పురస్కార గ్రహీత దాసరి వెంకటరమణ బాలల నవలలను పరిచయం చేశారు.

ఈ సభలో సాధన సంస్థ అధ్యక్షులు సిహెచ్. మురళీమోహన్ అధ్యక్షత వహించగా ఈ సభలో మంచి పుస్తకం నిర్వాహకులు సురేష్, పి. భాగలక్ష్మి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

www.digitaltimes.co

## What's Next For You?



**Leverage Our Digital Marketing Expertise for Your Business Evolution With The times**

- Content Marketing
- Position 0 & Next Gen SEO
- Lead Gen to Door Knocks
- E-commerce Multiplication

Google Partner | facebook for business | Microsoft Gold Partner

DIGITAL TIMES

Encinitas, USA; Hyderabad & Bangalore, India | hello@digitaltimes.co
**+91 98480 16666 +1 424-253-0800**




## తెలుగు సినిమా పాటకి సాహితీ గౌరవాన్ని అందించిన పాటలరేడు, విరించి, విపంచి - సిరివెన్నెల

సిరివెన్నెల భౌతికంగా మనమధ్య లేరన్న వార్త తెలుగువారందరినీ కలిచి వేస్తోంది.

తానా సంస్థకి ఆయన ఆత్మబంధువు. ప్రతిష్టాత్మకమైన తానా జీవనసాఫల్య పురస్కారాన్ని అందుకున్న ప్రముఖుడు. ఎంత ఎదిగినా ఒదిగి వుండే గొప్ప వ్యక్తిత్వం వారిది.

ఆయన్ని సత్కరించుకోవడం తెలుగుభాషని సత్కరించుకోవడం లాంటిది.

ఆయన అక్షరం ఒక ఝంఝామారుతం. పాట ఒక వెన్నెల కెరటం. ప్రతీ వాక్యం స్ఫూర్తిదాయకం.

ద్వంద్వార్థాలులేని చిక్కనైన అచ్చతెలుగు పాటకి ఆయనే చిరునామా.

సన్నివేశాలకి పాట రాసినా వ్యక్తిత్వ వికాసాన్ని ఆ పాటల్లో పొదిగిన ఘనుడు.

తెలుగు సినిమా పాటకి వెన్నెల సొబగులద్ది, వన్నె తెచ్చిన ఆ వెన్నెల మన మధ్యే ఉంటుంది.

మన నోటే ఆయన పాట నర్తిస్తుంది.

అదే వారికి మనమందరమూ ఇచ్చే ఘనమైన నివాళి.

తానా సంస్థ తరపున, సభ్యుల తరపున వారి ఆత్మకి శాంతి చేకూరాలని మనసారా నివాళి అర్పిస్తున్నాము. వారి కుటుంబసభ్యులకి తానా తరపున ప్రగాఢ సానుభూతి.




*Commercial complex leased to an Educational Institution located at MG Road is For Sale.*

*The complex contains 43,000 square feet on three floors. The monthly rent is $350,000.00 rs which will be increasing next year."The tenant will vacate in one year if desired. The property includes two acres of land with adequate parking and in a prestigious upcoming neighborhood. "The offering price is $15 million USA dollars. We will provide a mortgage to the qualified buyer with 30% down. The real estate taxes are $61,000.00 rs."The property was built in 1996 and in excellent condition."*

*"Interested parties please contact:*

**PRASAD MEDEPALLI**
(201) 364-7551. or email me at: vasanta07@gmail.com

❖ మహమ్మద్ ఖదీర్‌బాబు



# నా ఉచ్ఛ్వాసం కవనం.. నా నిశ్వాసం గానం

*'బటర్‌ఫ్లై' ఎఫెక్ట్ అంటే?*
*ఇక్కడ జరిగే ఘటన ఎక్కడి ప్రతిఫలనానికో అని.*
*భలేవాడివే. అది విధాత తలంపు కదా.*

## 1980...

*శంకరాభరణం* రిలీజైంది. ఊరూ వాడా సంబరాలు. సన్మానాలు. కాకినాడకు యూనిట్ వస్తోందట. సన్మానం చేయాలట. ఆ ఊళ్లో అప్పటికి ఒక బుల్లి కవి ఉన్నాడు. ప్రతి సాహిత్య సభలో ప్రారంభ గీతాన్ని పాడుతూ ఉంటాడు. 'అతణ్ణి అడుగుదాం... విశ్వనాథ్‌ని కీర్తిస్తూ ఒక పాట కట్టమందాం' అనుకున్నారు మిత్రులు.

'నేను విశ్వనాథ్ మీద కట్టను. వ్యక్తి మీద పాట ఏమిటి? *శంకరాభరణం* సినిమా మీద కడతాను. తెలుగువారి కళాదృష్టి దాహార్తిని తీర్చడానికి గంగలా ఆ సినిమా అవతరించింది. కనక గంగావతరణం పేరుతో గేయం రాస్తాను,' అన్నాడా కవి. రాశాడు. సన్మానం జరిగేరోజు వచ్చింది. యూనిట్‌ని చూడటానికి జనం విరగబడితే పోలీసులు ఈ బుల్లి కవిని లోపలికి పంపలేదు. కవికి అహం ఉంటుంది. 'నా పాట వినే అదృష్టం విశ్వనాథ్‌కు లేదు' అనుకుంటూ అక్కణ్ణుంచి వచ్చేశాడు. అంతేనా? 'నా పేరు ఎప్పటికైనా అతనికి తెలుస్తుంది' అనుకున్నాడు. నిజంగానే తెలిసింది కొన్నాళ్లకు. సిహెచ్. సీతారామశాస్త్రి. చెంబోలు సీతారామశాస్త్రి.

'కైలాసాన కార్తీకాన శివరూపం ప్రమిదే లేని ప్రమథాలోక హిమదీపం'... అని రాశాడు వేటూరి *సాగర సంగమం*లో. 'శంకరా నాద శరీరాపరా...' అని కూడా రాశాడాయన *శంకరాభరణం*లో. కె. విశ్వనాథ్‌కు నిజంగా తన సినిమాలో 'గంగావతరణం' పెట్టాల్సి

వస్తే వేటూరి సంతోషంగా రాసేవాడు. విశ్వనాథ్ సినిమాలకు వేటూరిది సింగిల్ కార్డ్. కాని జననీ జన్మభూమిలో ఆ సింగిల్ కార్డ్‌కు తోడు సిహెచ్. సీతారామశాస్త్రి అనే పేరు తోడయ్యింది.

ఆ సినిమాలో 'గంగావతరణం' అనే చిన్న డాన్స్ బ్యాలేకు సీతారామశాస్త్రి గతంలో రాసిన 'గంగావతరణం'లోని కొన్ని పంక్తులను వాడారు. అలనాడు కాకినాడలో సీతారామశాస్త్రి రాసిన గేయం ఆ నోట ఈ నోట విశ్వనాథ్‌దాకా వెళ్లి అది విని ఆయన ముచ్చటపడి సినిమాలో వాడాల్సి వచ్చింది. తెలుగు తెరమీద సీతారామశాస్త్రికి అది తొలి పాట లెక్క ప్రకారం. అంతటితో ఆ పాట ఆగిపోయేదేమో. కానీ కొనసాగాల్సి వచ్చింది.

ఎందుకంటే వేటూరికి విశ్వనాథ్‌తో ఏదో విషయంగా మాట పట్టింపు వచ్చి, 'ఇక విశ్వనాథ్‌కు పాటలు రాయను,' అన్నాడు. విశ్వనాథ్‌కు అప్పటికి సీతారామశాస్త్రి చేత రాయించాలని లేదు. సీతారామశాస్త్రి ఎవరో కూడా ఎప్పుడూ చూళ్లేదు. దాంతో ఆయన స్వాతిముత్యం సినిమాకు సినారెను, ఆత్రేయను ఆశ్రయించాల్సి వచ్చింది. ఆ తర్వాత సిరివెన్నెల తీయాలి. ఇటుచూస్తే తనకు అలవాటైన వేటూరి అలిగి ఉన్నాడు. అటుచూస్తే సీనియర్లు తనకు ఎక్కువ టైమ్ ఇవ్వలేనంత బిజీగా ఉన్నారు. ఏం చేయాలి? బటర్ ఫ్లై ఎఫెక్ట్ అంటే అదే. ఎవరో అలిగారు. సీతారామశాస్త్రికి సిరివెన్నెల వచ్చింది.

విధాత తలపున ప్రభవించినది అనాది జీవన వేదం... ప్రాణనాడులకు స్పందననొసగిన ఆది ప్రణవ నాదం...

1985 అక్టోబర్ 4న అఫీషియల్‌గా సీతారామశాస్త్రి తొలి పాట రికార్డ్ అయ్యింది. పాడటానికి వచ్చిన బాలూ ఆ వొత్తుజుట్టు, దళసరి కళ్లద్దాలు, పలుచటి శరీరం ఉన్న కవిని చూసి, 'మీరు కవిగా అమితశక్తిమంతులు. రాబోయే దశాబ్దాలు మీవే,' అన్నాడు. అలాగే జరిగింది. ఒకటి కాదు రెండు కాదు నాలుగు దశాబ్దాల పాటు సీతారామశాస్త్రి పాట సాగిపోయింది. మొదటి సినిమాలోనే ప్రశంసల వెన్నెల కురిసింది. ఇంటి పేరు సిరివెన్నెల అయ్యింది.

మద్రాసులో ఈ క్షణం కోడంబాకంలో కబురు పుడితే మరునిమిషం అది తడదాకా పాకుతుంది. ఎవరో కొత్త కవి అట. సీతారామశాస్త్రి అట. విశ్వనాథ్‌కు రాస్తున్నాడట. నిజమే. మరి మసాలా పాట రాస్తాడా? వెళ్లిన వాళ్లకు ఆ కవి చెప్పిన జవాబు.. పెట్టిన షరతులు మూడు. 1. స్త్రీలను కించపరచను 2. సమాజానికి చెడు సందేశాలు ఇవ్వను. 3. యువతకు కిర్రెక్కించే పాట రాయను. విన్న నిర్మాతలు సడేలే అనుకుని ముఖం తిప్పుకుని పోవడం మొదలెట్టారు. కాని సుకవి సుగంధం, సత్కవి మకరందం ఎవరు వదులుకుంటారు. శృతిలయలు విడుదలైంది. అంత వరకూ ఎప్పుడూ వినని అన్నమయ్య కీర్తన అందులో ఉంది.

తెలవారదేమో స్వామి
నీ తలపుల మునకలో అలసిన దేవేరి
అలమేలు మంగకూ...

ఈ కీర్తనను వెతికి పట్టాడంటే విశ్వనాథ్ ఎంత గొప్పవాడవ్వాలి. ఆ తర్వాత 'నంది' అవార్డులకు ఆ పాట వస్తే జడ్జిగా ఉన్న సి.ఎస్.రావు, 'ఏమయ్యా... ఇప్పుడు అన్నమయ్యకు నంది అవార్డు అవసరమా,' అనంటే, 'అది సీతారామశాస్త్రి రాసిన పాటండీ,' అని చెప్పారు. అన్నమయ్య రాసేడా అనిపించేలా సీతారామశాస్త్రి రాసిన పాట. 'నంది' ఆయన ఇంటికి నడుచుకుంటూ వచ్చింది.



రాంగోపాల్ వర్మ గొప్ప టెక్నీషియన్. కనుక గొప్ప వాళ్లే తన సినిమాకు పని చేయాలనుకున్నాడు. సీతా రామశాస్త్రితో కాలేజీ పాటా?

*బోటనీ పాఠముంది మేటనీ ఆట ఉంది*
*దేనికో ఓటు చెప్పరా?*

మిగిలిన సినిమా అంతా కుర్రకారు ఎంత ఉద్వేగంగా చూశారో ఈ పాటకు అంత ఉత్సాహంగా టక్కులు ఊడబెరికి గంతులేశారు. అయినాసరే... 'కమర్షియల్ సాంగ్' అనేది ఒకటి ఉంటుంది. శాస్త్రి గారు ఆ ఒక్క తరహా కూడా రాసేస్తే? రాయలేడా ఆయనా? బొబ్బిలిరాజా వచ్చింది.

*బలపం పట్టి భామ బళ్లో...*
*అఆఇఈ నేర్చుకుంటా...*

పాటా సినిమా సూపర్‌డూపర్ హిట్. ఇప్పుడు... సిరివెన్నెల సీతారామశాస్త్రి 'సమగ్ర సినీకవి' అయ్యాడు.

హంసలా బతకాలని నిశ్చయించుకోవాలేగాని బతకొచ్చు. కాకిలా కశ్మలంలో వాలాలనుకుంటే వాలొచ్చు. ఛాయిస్ మనదే. నిర్ణయం తీసుకుంటే అలా బతికే వీలు ప్రకృతి కల్పిస్తుంది. 'శుభ్రమైన పాట' రాయాలని సీతారామశాస్త్రి అనుకున్నాడు. దారిన వెళు తుంటే అదిగో ఆ మంచి పాట రాసింది అతనే అను కోవాలి... ఏదైనా సభకు పిలవాలి... ఎదుటపడితే నమస్కారం పొందేలా ఉండాలి... 'శాస్త్రిగారు'లా ఉండాలి... 'గాడు'... పేరు చివర పొరపాట్న కూడా పడకూడదు.

ఆయన తన తుదిశ్వాస వరకూ 'శాస్త్రిగారు'గానే ఉన్నాడు. పల్లవి మర్యాద. చరణం గౌరవం. కాంటెక్స్ట్‌లో పెట్టి చూపితే తప్ప సిరివెన్నెల గొప్పతనం అర్థంకాదు. గండుచీమ, బెల్లం, ఒడి, తడి, గొళ్లెం, తాళం వంటి పదాలు పాటలుగా చెలామణి అవుతున్న రోజుల్లో 'చెప్పవే చిరుగాలి చల్లగా ఎదగిల్లి' రాయడం కోసం కలాన్ని రిజర్వ్‌చేసి పెట్టుకోవడం సిసలైన వ్యక్తిత్వం. అసలైన సంస్కారం.

సరే. ఈ కవి పండితుడు కదా. ఈతనికి గ్రామీణుడి పదం తెలుసా... జానపదుని పాదం తెలుసా? స్వయంకృషి విడుదలైంది. 'సిగ్గూ పూబంతి యిసిరే సీతామాలచ్చి' రాశాడు.

'రాముడి సిత్తంలో కాముడు సింతలు రేపంగా' అని జానపద శృంగారం ఒలికించాడు.

ఆపద్బాంధవుడులో? 'ఔరా అమ్మకచెల్ల... ఆలకించి నమ్మడమెల్లా... అంత వింత గాథల్లో ఆనందలాల' రాశాడు. శుభసంకల్పంలో 'నీలాల కన్నుల్లో సంద్రమే నింగి నీలమంతా సంద్రమే' అని బెస్త పడవలో మీన మెరుపు వంటి పదాలను అల్లాడు. సిరివెన్నెలకు రాని విద్య లేదు.

పాట వచ్చి దాని మీద కేవలం డబ్బు సంపా దించేవాడు సగటు కవి అవుతాడు. దాని ద్వారా సమాజాన్ని జాగృతం చేయాలని తపించేవాడు ఉదాత్త కవి అవుతాడు. 'నిగ్గదీసి అడుగు ఈ సిగ్గులేని జనాన్ని' అని రాశాడు సిరివెన్నెల. సమాజంలో పాలకుల్లో ఎంత పెడధోరణి ఉన్నా ఎన్ని అకృత్యాలు సాగుతున్నా 'మనకెందుకులే' అని సాగిపోయే జనం ఈ పాటను విని భుజాలు తడుముకున్నారు.

తమ నిస్సహాయతకు సిగ్గుపడ్డారు. 'ఎవరో ఒకరు ఎపుడో అపుడు నడవరా ముందుకు అటు ఇటు ఎటో వైపు' అని అంకురంలో రాశాడు. ఒక్కళ్లే నడవడానికి భయమా? 'మొదటి అడుగు ఎప్పుడూ ఒంటరే మరి' అని చెప్పాడు. ఎంత ధైర్యం ఇలాంటి కవి పక్కన ఉంటే. 'నువ్వు తినే ప్రతి మెతుకు ఈ సంఘం పండిం చింది' అన్నాడు రుద్రవీణలో. 'రుణం తీర్చు తరుణం వస్తే తప్పించుకుపోతున్నావా... తెప్ప తగల బెట్టేస్తావా ఏరు దాటగానే' అని ఈసడిస్తాడు. 'నిత్యం కొట్టుకుచచ్చే జనాల స్వేచ్ఛను చూద్దామా... దాన్నే స్వరాజ్యమందామా'... అని ఆయన ఈ దేశపు వర్తమానాన్ని ఎద్దేవా చేస్తాడు.

ఒక్క పాట వేయి మోటివేషనల్ స్పీచ్‌లకు సమానం. నిరాశలో కూరుకుపోయి, నిర్లిప్తతలో కుదే లైన వారికి లే.. లేచి నిలబడు అని ఉపదేశం ఇచ్చిన వాడు సిరివెన్నెల. 'ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి' అన్నాడు. సిరివెన్నెలకు 20 ఏళ్ల వయసు ఉన్నప్పుడు

40 ఏళ్ల వయసు కలిగిన తండ్రి చనిపోయాడు. ఇద్దరు తమ్ముళ్లు. ఇద్దరు చెల్లెళ్లు. జీవచ్ఛవంలా మారిన తల్లి. వారి కోసం బతికాడు సిరివెన్నెల. అందుకే-

నొప్పిలేని నిముషమేది జననమైన మరణమైన
జీవితాన అడుగడుగున
నీరసించి నిలిచిపోతే నిముషమైన నీది కాదు
బతుకు అంటే నిత్యఘర్షణ
దేహముంది ప్రాణముంది
నెత్తురుంది సత్తువుంది
అంతకంటే సైన్యముండునా
ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి...
అని రాశాడు.

'మనసు కాస్త కలత పడితే మందు ఇమ్మని మరణాన్ని అడగకు' అని శ్రీకారం కోసం ఆయనే రాశాడు. 'భయం లేదు భయం లేదు నిదర ముసుగు తీయండి... తెల్లారింది లెగండోయ్' అని కోడికూతను వినిపించాడు.

ఒరే ఆంజనేయులు...
తెగ ఆయాస పడిపోకు చాలు
మనం ఈదుతున్నాం
ఒక చెంచాడు భవసాగరాలు
కరెంటు రెంటు ఎట్సెట్రా మన కష్టాలు
కర్రీలో కారం ఎక్కువ అయితే కన్నీళ్లు
నైటంతా దోమల్తో ఫైటింగే మనకు గ్లోబల్ వార్
భారీగా ఫీలయ్యే టెన్షన్లేం పడుకు గోలీమార్...

అని 'అమృతం' టైటిల్ సాంగ్. రోజూ వింటే బి.పి ట్యాబ్లెట్ అవసరం రానే రాదు.

'నా మొదటి సినిమా 'కుక్క' అయి ఉంటే నా గతేంకాను,' అని నవ్వాడాయన ఒకసారి. కాని 'విధాత తలంపు' అలా ఎందుకు ఉంటుంది. విధాత ఆయనకు 'సిరివెన్నెల' రాసిపెట్టాడు. విధాత ఆయనకు తెలుగువారికి కాసిన్ని మంచి పాటలు ఇచ్చి రావోయ్ అని భువికి పంపాడు. విధాత ఆయనను నీ మార్గాన నడుచు శిష్యకవులను సిద్ధం చేయమని ఆదేశించి పంపాడు. ఇపుడు? ఇక చాలు నేను వినాల్సిన నీ పాటలు ఉన్నాయి... తెలిమంచు వేళల్లో మబ్బులపై మార్నింగ్ వాక్ చేస్తూ ఆ స్వర సంచారం పదసంవాదం చేద్దాంపద అని వెనక్కి పిలిపించు కున్నాడు. ఉపదేశం ఇచ్చే కవి ఊరికే ఉంటాడా? 'దేవుడా... ఈ లోకాన్ని మార్చు' అని పాట విని పించడూ?

అందాక ఆ కవిని గౌరవించడానికి ఆయన మంచి పాటలు పాడుకుందాం. ఈ జగత్తు మనదిగా అనుకోవాలి. జనులందరి బాగు కోరుకోవాలి. మనల్ని బాధించే మోహాల దాహాల ఒంటరి నిర్మోహత్వాన్ని సాధన చేయాలి. సిరివెన్నెల పాట చిరాయువుగా ఉండాలి.

జగమంత కుటుంబం నాది...
ఏకాకి జీవితం నాది
సంసార సాగరం నాదె...
సన్యాసం శూన్యం నాదె...



WWW.TECHINSURANCEINC.COM

# YOUR EMPLOYEES HEALTH OUR PROMISE



## HEALTH INSURANCE FOR IT COMPANIES

## BUSINESS INSURANCE

## VISITORS INSURANCE



**MURALI TALLURI**
**FOUNDER**
**+1 (512) 917 - 8686**
murali@techinsuranceinc.com

**TECH INSURANCE AGENCY**
EMPLOYEE BENEFITS & BUSINESS INSURANCE

(512) 917-8686
Fax:1-512-829-3488

Contact us:3000 Polar Ln, Unit#802
Cedar Park ,TX,78613

కథ

* ఉమామహేశ్ ఆచాళ్ల

# ఒక రాత్రి

"హలో పెద్దాడా... నేను..." శంకరం గొంతులో ఏడుపు జీర.

" డాడీ, ఏంటి ఈ టైంలో ఫోన్ చేశారు? ఏమైంది?" అడిగాడు ఆదుర్దాగా, పొరుగు రాష్ట్రంలో ఇంజనీరింగ్ చదువుతున్న పెద్దకొడుకు.

"మీ అమ్మ పోలీస్‌స్టేషన్‌కెళ్లి నా మీద కంప్లైంట్ ఇచ్చిందిరా," ఏడుపు ఈసారి స్పష్టంగా తెలుస్తోంది.





"అమ్మ పోలీస్‌స్టేషన్ వెళ్లిందా... అసలేమైంది డాడీ!" జరిగిన విషయం కొడుక్కి చెబుతుంటే, దృశ్యం మళ్లీ కదలాడింది.

*

ఆ రాత్రి భోజనాలయ్యాక మంచం మీద కూర్చుని ఒక మిత్రుడిచ్చిన కవిత్వం పుస్తకం తిప్పుతున్నాడు శంకరం. సౌమ్య మంచానికి అవతలి వైపు కూర్చుని దానిమ్మపండు ఒలుస్తోంది. కిటికీ ఆవల లేత అరిటాకు మీద పల్చటి వెన్నెల తారట్లాడుతోంది.

"వచ్చే నెల మీ కమలాంటీ కూతురి పెళ్లటగా..." గింజలు శంకరం చేతిలో పోస్తూ అంది సౌమ్య.

"చెప్పటం మర్చిపోయాను. ఈరోజు తను ఫోన్ చేసింది. మనల్ని కూడా రమ్మంది. శుభలేఖ వాట్స్ అప్‌లో పెట్టింది. నీకు మరీ మరీ చెప్పమంది."

"మీ అమ్మగారు వాళ్లూ వస్తారేమో? పెళ్లి దువ్వాడలో కదా... వాళ్లకి అలా రావటమే సులువు. మధ్యాహ్నం అత్తయ్యగారు ఫోన్ చేశారు. 'కాకినాడ నించి వచ్చేప్పుడు దువ్వాడే ముందొస్తుంది. మళ్లీ మీ ఇంటికి రావాలంటే బోలు ట్రాఫిక్కు. అలా వచ్చి వెళ్లిపోతాం. వైజాగ్‌నించి మీరొస్తే పెళ్లిలో కలిసి సరదాగా కాసేపు కబుర్లు చెప్పుకుని ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోవచ్చుని,' అన్నారు."

"అమ్మకు సరిగ్గా తెలియదేమో! పెళ్లి దువ్వాడ రైల్వే కల్యాణమండపంలో కాదు. వాల్తేర్ స్టేషన్ దగ్గర రైల్వే కల్యాణమండపంలో," జవాబిచ్చాడు. అలా అన్నప్పుడు సాయంత్రం ఫోన్‌లో అమ్మ మాటలు గుర్తొచ్చాయి. 'ఒరేయ్ శంకూ, కమలమ్మ కూతురి పెళ్లికి నేను, మావయ్య, సీతాలు, కాంతం పిన్ని కారులో వస్తున్నాం. మాకు కళ్యాణమండపం దోవ తెలీదు. మీ ఇంటికొస్తాం. అక్కడనించి అందరం కలిసి వెళదాం అన్నాడు మావయ్య. మధ్యాహ్నం మీ ఆవిడకి ఫోన్ చేస్తే మీకు మా ఇంటికన్నా అదే దగ్గర, అక్కడే కలుద్దాం అంటోంది. ఏం ఆమాత్రం ఓ పూట మీ ఇంటికి రాకూడదా... నువ్వు గట్టిగా చెప్పు దానికి... మూగిముచ్చులా నోర్మూసుకుని కూర్చుంటే ఇలాగే ఉంటుంది.'

"అవునా, నేనింకా పెళ్లి దువ్వాడలో అనుకుంటున్నా. ఒకవేళ వాళ్లు వచ్చినా మీ అక్కింటికి వెళ్తారేమోలే! వాళ్లకి అక్కడే బాగా అలవాటు," అంది సౌమ్య కొన్ని గింజలు పక్కరూంలో చదువుకుంటున్న రెండో కొడుకు బన్నీకి ఇవ్వడానికి లేచి వెళ్తూ.

శంకరం పిన్ని కూతురు కూడా వైజాగ్‌లోనే ఉంటోంది, తనకి పెద్దమ్మంటే ఇష్టం.

"ఎవరెవరు వస్తున్నారట?"

"అమ్మా, మావయ్య, కాంతం పిన్ని... మొత్తం నలుగురు."

"నాలుగోదెవరో..." కళ్లు చిట్లించింది.

"సీతాలు," రాబోయే విపత్తు ఊహిస్తూ మెల్లగా గొణిగాడు.

"ఓహో... నా ఎదురుగా ఆ పేరు పలకరేమో తమరు. మీరు, మీరు బాగానే ప్లాన్ చేసుకుంటారు.. నేనే మధ్యలో పైదాన్ని. అలాంటప్పుడు నా యింటికెందుకో రావటం."

సీతాలు శంకరానికి మావయ్య కూతురు. శంకరం కంటే రెండేళ్లు పెద్దది. చిన్నప్పుడే ఆమె తల్లి పోతే శంకరం, మిగతా కజిన్స్‌తోబాటు ఉమ్మడి కుటుంబంలోనే పెరిగింది. పెళ్లయిన ఏడాదికే భర్త వదిలేసి వెళ్లిపోయాడు. ఎక్కడున్నాడో, ఉన్నాడో లేడో కూడా తెలియదు. మావయ్య ఇల్లు శంకరం వాళ్ల అమ్మ ఉండే ఇంటికి రెండిళ్లవతల. సౌమ్యకి సీతాలంటే ఎందుకో నచ్చదు. ఎప్పుడైనా అమ్మని చూసొస్తానంటే తనూ వస్తానంటుంది.

లేదంటే శంకరాన్నీ వెళ్లనివ్వదు. ఎందుకొచ్చిన గొడవని శంకరం కూడా సీతాలుతో మాట్లాడ్డం మానేసాడు. సౌమ్య మాత్రం సీతాలెప్పుడు ఎదురైనా చక్కగా మాట్లాడుతుంది. ఇవేమీ తెలియని శంకరం

అమ్మా, మావయ్యాలు మాత్రం, 'ముంగిగాడు.. వాడి పెళ్లామే నయం కలివిడిగా ఉంటుంది,' అంటారు.

"అయినా నేనేం పెళ్లికి రాను. నాకెవరూ చెప్ప లేదు. నీకు నచ్చితే నువ్వెళ్లు," అంది సౌమ్య చాకు క్లీన్ చేస్తూ. కంట్లో కారం పడితేనే కాదు పంచదార పడినా కష్టమే అన్నట్టు, ఎంత సౌమ్యంగా ఉన్నా ఆ సంభాషణ అతనికి ఇబ్బందిగానే ఉంది. ఇది ఇక్కడితో ముగిసేలా లేదని, పుస్తకం మడిచి, "సౌమ్యా, ఎప్పుడో నెల తర్వాత ఎవరిదో పెళ్లి. దాని గురించి ఇప్పు డెందుకీ ఆర్గ్యూమెంట్?" అన్నాడు శంకరం.

"బావుంది... నేనేం ఆర్గ్యూ చేశాను. ఏదీ నాతో చెప్పవు. అన్నీ నేనే అడిగి తెలుసుకోవాలి. నీకంతా గుట్టు. సీక్రెట్‌గా ఏమేం చేస్తున్నావో..."

"ఇందులో సీక్రెట్ ఏముంది. వాళ్లు ఒక్కపూట వస్తారు అనేటప్పటికీ నీకు టెన్షన్ స్టార్ట్ అయ్యింది. నాకు చెప్పకుండా వాళ్లని నేరుగా అటే రండి అంటే ఏంటి అర్థం?" అన్నాడు కోపంగా.

"పెళ్లి దువ్వాడలో అనుకుని అలా అన్నాను. దానికెందుకంత గింజుకుపోతావు. అయినా వాళ్లెప్పుడూ రాలేదా ఏమిటి?" విసురుగా.

"గింజుకుపోవడం ఏమిటి... మర్యాదగా మాట్లాడు."

"వస్తున్నారుగా నీకు మర్యాదిచ్చేవాళ్లు... వాళ్లతో వెళితే సరి."

అంతే... బుసబుస పొంగింది ఆవేశం. విసురుగా చాచి లెంపమీద కొట్టాడు. వాళ్ల అరుపులకి బన్నీ బెదిరిపోయాడు.

సౌమ్య ఒక్క నిమిషం భర్తకేసి తీవ్రంగా చూసి ప్లేట్‌లో ఉన్న కత్తి చేతిలోకి తీసుకుంది. కసికొద్ది ఎడమచేతిని గట్టిగా కోసుకుంది. శంకరం కోపం మరింత పెరిగింది.

"ఏం బెదిరిస్తున్నావా? నువ్వూ నీ చెత్త నోరు... కడుపుకి ఏం తింటున్నావు..." చేతిలో పుస్తకం విసిరి కొట్టాడు

"నువ్వు సంపాదించే అత్తెసరే," అంతే విసురుగా జవాబిచ్చింది.

"అవును... పగలూ రాత్రీ మీకోసం గాడిదచాకిరీ చేస్తూ, ఒక్కపూట మా అమ్మ వస్తానంటే ఇంత రాద్ధాంతం చేస్తున్నావు."

"నేనేం చెయ్యలేదు.. నువ్వే తాగుబోతోడికంటే అధ్వాన్నంగా బిహేవ్ చేస్తున్నావు..." అసహ్యంగా చూసింది.

బన్నీ వాళ్లని ఆపడానికి ప్రయత్నిస్తున్నాడు. వీధి తలుపు తీసే ఉంది. ఆ ఫ్లోర్ అంతటికీ అరుపులు వినిపిస్తున్నాయి.

సౌమ్య చేతినించి రక్తం కారుతోంది. "నేనే కదా మీకు అడ్డు. నేను చస్తే మీ అమ్మ నీకు దాన్నిచ్చి పెళ్లి చెయ్యాలని చూస్తోంది. ఈరోజు మీ అందరి కోరిక తీరబోతోంది," అంది, రక్తాన్ని ఆపే ప్రయత్నం చెయ్యకుండా.

"నోర్మూయ్... నోటికెంతొస్తే అంతే..." మళ్లీ చెయ్యెత్తాడు శంకరం.

సౌమ్య విసురుగా లేచింది. లోనికెళ్లి నైటీ మార్చి డ్రెస్ వేసుకుని, స్కూటీ తాళం తీసుకుని కొడుకుని బరబరా లాక్కుని కిందకెళ్లిపోయింది

'వాళ్ల అన్నయ్య అదే ఊర్లో ఉంటాడు. అక్కడికే





వెళ్లొంటుంది, ఓరోజుండి తనే వస్తుందిలే,' అని మంచంమీద వాలిపోయాడు. ఫోన్ మ్రోగటంతో ఉలిక్కిపడి లేచాడు. పోలీస్‌స్టేషన్ నుండి రైటర్ ఫోన్..

సౌమ్య కంప్లైంట్ ఇచ్చిందట. ఎస్.ఐ. రమ్మంటున్నారంటూ!

*

శంకరం చెప్పిందంతా విన్నాడు పెద్దకొడుకు. "డాడీ ఎంతో లైఫ్ చూశావు. నాతో ఎన్నో విషయాలు మాట్లాడతావు. ఇంత చిన్న చిన్న విషయాలకి నువ్వు టెంపర్ లూజ్ అవుతావంటే నమ్మలేకపోతున్నా. సరే నువ్వేం కంగారుపడకు. నువ్వు స్టేషన్‌కి వెళ్లు. అమ్మకి నేను ఫోన్ చేస్తా... డోంట్ వర్రీ," అంటూ ఫోన్ పెట్టేశాడు.

ఎందుకైనా మంచిదని సౌమ్య వాళ్ల అన్నయ్యకి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్‌లో ఉంది. లేచి మొహం కడుక్కుని, లుంగీ మార్చి ఫాంట్ వేసుకుని, వాలెట్ జేబులో పెట్టుకుని ఇంటికి తాళం వేశాడు. ఐదొందల మీటర్ల దూరంలో ఉన్న స్టేషన్‌కి ఆ అర్ధరాత్రి నడుచుకుంటూ, చెమట్లు కక్కుతూ బయల్దేరాడు శంకరం.

'గగనమంతా నిండి పొగలాగు క్రమ్మి - బహుళ పంచమి జ్యోత్స్న భయపెట్టు నన్ను,' రాత్రి ఆ కవిత చదువుతూంటే అర్థం కాలేదు. బహుశా మన అనుభవంలోకి వస్తే తప్పించి బోధపడదేమో! నడుస్తూ ఉంటే వెన్నెల పెట్రోమాక్స్ లైట్‌లా వేడిగా అనిపించింది.

*

పోలీస్ స్టేషన్లో అడుగు పెట్టటం అతనికి అదే మొదటిసారి. చాలా విశాలంగా ఉంది. చుట్టూ మొక్కలు. అర్ధరాత్రి కావటంతో స్కెలిటన్ స్టాఫ్ మాత్రమే ఉన్నారు. రైటర్ ఎదురుగా కుర్చీలో సౌమ్య కూర్చుని ఉంది. పక్కనే బన్నీ నిద్రకి జోగుతున్నాడు. రైటర్ చెప్పినట్టున్నాడు. చేతికి రుమాలుతో కట్టు కట్టుకుంది. ఏడ్చినట్టుంది. మొహం బాగా ఉబ్బి ఉంది. ఒక్క క్షణం జాలేసింది.

రెండు సి-సెక్షన్లు, ట్యూబెక్టమీ కాకుండా ఈ మధ్యే హిస్టరెక్టమీ కూడా అయ్యింది. ఎప్పుడో తెల్లారి ఐదుకి లేస్తుంది. పాలు, కాఫీలు, టిఫిన్లు, బాక్స్‌లు, మళ్లీ స్నాక్స్, రాత్రికి వంట, పొద్దున్నకి పిండాడుకోవటం- ఇలా క్షణం తీరిక లేకుండా పని చేస్తుంది. కానీ ఇంటికి ఎవరైనా వస్తారంటే ఎందుకో ఇష్టపడదు. అదో అబ్సెషన్. పెళ్లైన కొత్తలో ఉద్యోగం చేస్తానంటే అత్తగారు ఒప్పుకోలేదు. ఆవిడమీద అదో కోపం. శంకరానికి తొందరపడ్డాననిపించింది. రైటర్ వివరాల డిగి కూర్చోమన్నాడు. సౌమ్యని కాసేపు బయట వెయిట్ చెయ్యమని, ఓ సారి ఆవులించి, నెమ్మదిగా...

"సర్, మీరు చదువుకున్నవారు. పైగా బ్యాంకులో పనిచేస్తున్నారు.. మీరే ఇలా చేస్తే ఎలా? ఈ పులి వేషాలు... పెళ్లాన్ని కొట్టడాలు... ఎప్పుడో పోయాయి సర్. 498 డి.వి యాక్ట్ గురించి మీకు తెలిసే ఉంటుంది. ఆవిడ మీ అమ్మగారి మీద కూడా కేసు పెట్టమంటోంది. మా ఎస్.ఐ.గారు సి.ఐ.గారితో మాట్లాడారు. ఇలాంటి కేసుల్లో ఎఫ్.ఐ.ఆర్ వెంటనే కట్టమని మాకు ఆర్డర్స్. పైగా ఆవిడ వంటిమీద ఇంజురీస్ కూడా ఉన్నాయి. చెప్పండి ఏం చేద్దాం?" అన్నాడతను ఏదో ఫైల్ చూసుకుంటూ.

"సర్, అదీ..." శంకరానికి చాలా ఎంబారాసింగ్‌గా ఉంది.

"అదే సర్, ఆవిడ. కాంప్రమైజ్‌కి ఒప్పుకోవటం లేదు. లేకపోతే మాకేమన్నా సరదానా. పైగా ఈరోజు శుక్రవారం. సోమవారం వరకూ మెజిస్ట్రేటుగారు దొరకరు. ఆలోచించుకోండి. ఇంతలో మా సి.ఐ.గారు కూడా వస్తారు," అంటూ లేచి బయటకి వెళ్లాడు.

శంకరం పెద్దకొడుక్కి మళ్లీ ఫోన్ చేశాడు. ఎంగేజ్ వస్తోంది. బయట సౌమ్య ఫోన్ మాట్లాడుతోంది. బహుశా పెద్దకొడుకే అయ్యుండొచ్చు. సౌమ్య దగ్గర కెళ్లడానికి చాలా ఇబ్బందిగా ఉంది. చెయ్యి చేసుకుని తను ఎంత తప్పు చేశాడో, స్టేషన్‌కొచ్చి సౌమ్యా అంతే తప్పు చేసిందని అతని ఫీలింగ్.

సౌమ్య ఫోన్ పెట్టేయగానే, శంకరం ఫోన్ రింగ్ అయ్యింది.

"హలో డాడీ... అమ్మతో నేను మాట్లాడాను. కంప్లైంట్ విత్ డ్రా చేసుకుంటానంది. నేను నెక్స్ట్ వీక్ వచ్చాక అన్నీ మాట్లాడదాం. మీరు జాగ్రత్తగా ఉండండి. ఇంటి కెళ్లగానే ఫోన్ చెయ్యండి.. ఓకే బై," అంటూ ఫోన్ పెట్టేశాడు.

ఒక్కసారిగా ఊపిరి పీల్చు కున్నాడు. ఇంతలో రైటర్ సీట్లో కొచ్చాడు. సౌమ్య అతని దగ్గరకెళ్లి కంప్లైంట్ విత్ డ్రా చేసుకుంటా నని చెప్పింది. మళ్లీ ఇలాంటి పని చెయ్యనని శంకరం దగ్గరొక అపాలజీ లెటర్ తీసు కుందామని అతను సలహా ఇచ్చాడు. సరేనంది.

ఇంగ్లీష్‌లో లెటర్ రాసిచ్చాడు శంకరం. సౌమ్యని వెళ్లిపొమ్మని, శంకరాన్ని ఉండమన్నాడు రైటర్. అర్థమైంది. స్టేషన్ స్టేషనరీ అంత కాస్ట్లీ అని ఆరోజే తెలిసింది. వెంటనే ఏ.టి.ఎం కెళ్లొచ్చి, థాంక్స్ చెప్పి అర్ధరాత్రి రెండు గంటలకి ఇంటికొచ్చి హాల్లోని సోఫాలో తెల్లవారేవరకూ అటూ ఇటూ దొర్లాడు.

*

ఆ తర్వాత వారం వరకూ ఉప్పెనొచ్చి ఊడ్చేసిన ఊరులా ఇల్లు నరకాన్ని తలపించింది.

కాఫీ కొడుకు చేత పంపేది సౌమ్య. బన్నీ స్కూల్‌కి వెళ్లిపోయాక టిఫిన్ టేబుల్ మీద పెద్ద చప్పుడు చేసి పెట్టేది. క్యారేజీ కట్టి సోఫాలో పెట్టేది. రాత్రి ఏ తొమ్మిదికో ఇంటికొస్తే టేబుల్ మీద హాట్ ప్యాక్‌లో అన్నీ ఉండేవి. తను అప్పటికే పడుకునేది. అనుకున్న రోజు రానే వచ్చింది.

ఆ రాత్రికే కమలాంటీ కూతురు పెళ్లి. ఉదయాన్నే శంకరం తల్లి, మావయ్య, కాంతం పిన్ని, సీతాలు వచ్చారు. సౌమ్య వాళ్లని ప్రేమగా పలకరించింది. టిఫిన్లు పెట్టి కాఫీ ఇచ్చింది. సీతాలు తనకెవరో ఇచ్చిన ఇంపోర్టెడ్ మేకప్ కిట్ సౌమ్యకిచ్చింది. సౌమ్య సీతాలుకి చీర పెట్టింది. అత్తగారు తెచ్చిన వడియాల పిండి, ఆవకాయ కిచెన్‌లో భద్రంగా సర్దుకుంది.

శంకరం మావయ్య సౌమ్య చేతిలో వెయ్యి రూపాయలు పెట్టాడు. సౌమ్య మొహమాటపడుతూనే తీసుకుంది.

సాంబారు, బంగాళాదుంప కూర, గోంగూర పచ్చడి, అప్పడాలు, సేమ్యా, గడ్డ పెరుగుతో భోజనాలు పెట్టింది. అందరూ ఏ.సి రూమ్‌లో కూర్చుని కబుర్లు చెప్పుకున్నారు. శంకరం వంటరిగా బాల్కనీలో కూర్చున్నాడు. అతని ఎదురుగా అరటి చెట్టు. అంత పెద్ద అరిటాకూ చీలికలై పురికొసకి కట్టిన జండాలా ఊగుతోంది. రాత్రి అందరూ పెళ్లికి బయలుదేరారు. అతని తల్లి, కాంతం పిన్నీ శంకరం కారు ఎక్కారు. సీతాలు, బన్నీ, సౌమ్యా, మావయ్య కార్లో శంకరాన్ని అనుసరించారు. దారిలో శంకరంతో వాళ్లమ్మ, "దాన్నేమనకురా. అది చాలా మంచిది. నువ్వే చుప్పనాతోడివి. మమ్మల్ని ఎంత బాగా చూసుకుంది. అది చెప్పినదానికల్లా ఊకొట్టు. గిల్లికజ్జాలు పెట్టి దాని బుర్ర పాడుచెయ్యకు," విసుక్కుంది.

పెళ్లిలో సౌమ్య చాలా సందడిగా తిరిగింది. అంతా సౌమ్యని తెగ మెచ్చుకున్నారు. చాలా చలాకీదన్నారు. ఇంటినీ, భర్తనీ, పిల్లల్ని చక్కగా చూసుకుంటుందని కితాబిచ్చారు. శంకరం తల్లి, మావయ్య, సీతాలు అట్నుంచటే వెళ్లిపోయారు. శంకరం, సౌమ్య, బన్నీ ఇంటికొచ్చేశారు. వాళ్ల మధ్య మళ్లీ మౌనం అబ్సొల్యూట్ మెజారిటీతో అధికారంలోకి వచ్చింది.

*

"రండి సర్ రండి. వెల్కమ్ టు అవర్ స్మాల్ ఆఫీస్," అంటూ ఆప్యాయంగా రిసీవ్ చేసుకున్నాడు ముప్పై అయిదేళ్ల లాయర్ సుబ్రహ్మణ్యం. శంకరం పనిచేసే బ్యాంకుకి పేనల్ అడ్వకేట్. డిఫాల్టర్స్‌కి నోటీసులు ఇచ్చేటప్పుడు, దావాలు ఫైల్ చేసేటప్పుడు అతనికి శంకరం చాలా సహకారం అందిస్తాడు. అందుకే శంకరమంటే గౌరవం. టీ తెప్పించాడు. తాగుతూ విషయం చెప్పాడు. అతను చాలా బాధ పడ్డాడు.

రెండు మూడు ప్రశ్నలేసి, "ఇలా జరక్కుండా

ఉండవలసింది సర్. ఇప్పుడేం చేద్దామనుకుంటున్నారు?" అడిగాడు.

"ఇంత జరిగాక పాము, ముంగిసకి ఆర్.ఏ.సిలో ఒకే బెర్త్ వచ్చినట్టు, మేం కలిసుండలేం సర్. తనని కొట్టడం నా తప్పే అయ్యుండొచ్చు. కానీ దానికి నన్ను పోలీస్‌స్టేషన్‌కి లాగనవసరం లేదు. మాది చెస్ట్ బ్రాంచ్. నేను జాయింట్ కస్టోడియన్ అవటం చేత తాళాలు నా దగ్గరుంటాయి. తెల్లారితే నా పరువు పోయుండేది. నా పెద్దకొడుకు చెప్పబట్టి ఆమె ఊరుకుంది. లేదంటే..." కళ్లనీళ్లు పెట్టుకున్నాడు శంకరం.

"ఛ... ఛ... ఊరుకోండి సర్, ఇప్పుడేమైంది," అన్నాడతను జాలిగా.

"సర్, ఆరోజు కొట్టడం ఒక్కటే కారణం కాదు. ఆమెకి జీవితం.. గ్లోబ్‌లో బైక్ తిరిగినట్టు ఎక్కడా ఆగకూడదు. ప్రమోషన్ తీసుకోకుండా ఇక్కడే ఉంటున్నానని ఆమెకి ఎప్పటినుంచో కోపం. దానివల్ల మా పిల్లలు చక్కగా ఒకేచోట ఎటువంటి డిస్టర్బన్స్ లేకుండా పెరుగుతున్నారు, చదువుకుంటున్నారు. పసిబిడ్డ, పచ్చని మొక్క ఎదుగుదల రోజూ కనబడదు. మాకంటూ ఓ ఇల్లు, ఆరోగ్యంగా... క్రమంలో ఎదుగుతున్న పిల్లలు, ఇంతకంటే ఏంకావాలి. రాలినపండుతో కాలక్షేపం అవుతూ ఉంటే చెట్టెక్కవలసిన అవసరం ఏముందనేది నా పాలసీ," శంకరంలో ఆవేశం.

"సర్, ఇలాంటి డిఫరెన్సెస్ ప్రతీ ఇంట్లోనూ కామనే. ఓ క్రిమినల్ కేసు ఆర్గ్యూమెంట్‌లో ఉండగా నా భార్య ఫోన్ చేస్తుంది. ఎత్తకపోతే మళ్లీ మళ్లీ చేస్తుంది. జడ్జిగారికి అపాలజీ చెప్పి కోర్ట్ హాల్ బయటకొచ్చి ఫోన్ తీస్తే పొద్దున్న తెచ్చిన బెండకాయలు ముదురుగా ఉన్నాయి, కూరకి సరిపోలేదంటుంది విసురుగా. ఆక్షణమే అట్నుంచటే ఏ ఫారినో పారిపోదామనిపిస్తుంది. ఆ ముందురోజు రాత్రి నా ఆరేళ్ల కూతురు మా మధ్యలో పడుకుని కాసేపు నన్ను, కాసేపు వాళ్లమ్మని తడుముకుంటూ నిశ్చింతగా పడుకోవటం గుర్తొస్తుంది. మర్నాడు మళ్లీ కవరు పట్టుకుని కరివేపాకుకి... ఆ తర్వాత కాగితాల కట్టలు పట్టుకుని కోర్ట్‌కి వెళ్తాను. ఇంతకంటే మీకు చెప్పలేను..." నవ్వాడు సుబ్రహ్మణ్యం.

కొద్దిసేపు తర్వాత మళ్లీ ఆయనే, "కాదూ, కూడదూ... డైవోర్స్‌కి అప్లై చేద్దామంటారా? నేను ఫ్యామిలీతో వెకేషన్‌కి వెళ్తున్నాను. వారం తర్వాత రండి ఫైల్ చేద్దాం," అంటూ శంకరాన్ని ఆలోచించుకోమని చెప్పి పంపేశాడు.

*

"నమస్తే... మేడం మీతో కొంచెం పనుండీ..." తలదించుకుంది సౌమ్య.

"చెప్పండి," అందావిడ.

సౌమ్య జరిగిందంతా చెప్పింది. అంతా విని ఆవిడ కొన్ని ప్రశ్నలడిగింది.

"మేడం, ఆయన చాలా తెలివైనవారు. ఇరవై ఏళ్లకే బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. అందరిలాగానే నేనూ ఎన్నో ఆశలతో కాపురానికొచ్చాను. కానీ వచ్చాక తెలిసింది, అతను నేలమీద కూడా తాడుమీద నడిచినంత ఆచితూచి అడుగులేస్తారని. ఎంత చెప్పినా వినకుండా పారుగూరు వెళ్లాలని ప్రమోషన్ కూడా వదిలేసుకున్నారు. లేదంటే ఈపాటికి ఏ చీఫ్ మేనేజర్‌గానో ఉండేవారు. ఎక్స్‌ప్లోజర్ ఉండేది. మూడు పూటలా తిండికి మురిసిపోవడం నావల్ల కాదు. చిటారు కొమ్మనున్న పండైనా ఎక్కి కొయ్యాలి తప్ప రాలినప్పుడే తిందాం అనే తత్వం నాకు నచ్చదు," కళ్లు తుడుచుకుంది సౌమ్య.

"సౌమ్యగారు, మీవారు మిమ్మల్ని కొట్టటం తప్పే. కానీ, సారీ టు సే, ఆ క్షణం మీరే ఆయనకంటే హింసాత్మకంగా ప్రవర్తించారేమో... నా హస్బెండ్ జీతం ఎక్కువొస్తుందని వద్దన్నా వినకుండా గల్ఫ్ వెళ్లారు. ఒంటరిగా ఉంటూ, ప్రొఫెషన్‌ని, పిల్లల్నీ మేనేజ్ చెయ్యలేక చాలా కోపం వచ్చేది. ఒక స్టేజ్‌లో విడిపోదాం అనుకున్నాను. కానీ, పొద్దున్నించి పిల్లలకి ఎంత చేసినా రాత్రి వాళ్ల నాన్న చేసే వీడియో కాల్ కోసం చాలా ఎక్సయిటింగ్‌గా ఎదురుచూస్తారు. 'రోజంతా చాకిరీ చేసేది నేను, మీరు మాత్రం ఎప్పుడూ తలచేది నాన్నని,' అని విసుక్కుంటే, 'నువ్వు మా దగ్గరే

ఉన్నది మాకోసమైతే, నాన్న మాకు దూరంగా ఉన్నది కూడా మాకోసమే,' అంటారు. దాంతో నా నిర్ణయం మార్చుకున్నా.

"సాధారణంగా మన పిల్లలంటే మనకి ప్రాణం. దాంతో వాళ్లకేది నచ్చితే అది మనకీ నచ్చి తీరుతుంది. కానీ వాళ్లకిష్టమైన నాన్నమ్మ మాత్రం మనకెప్పుడూ శత్రుపక్షమే. వాళ్లకోసం కోపాన్ని సహనంగా మార్చలేమా...

"సారీ, నేనేదో మిమ్మల్ని జడ్జ్ చేస్తున్నాననుకోకండి. ఎనీవే రేపు మావారు వస్తున్నారు. వన్ వీక్ నేను బిజీ. మీకు డివోర్స్ కావాలి అనిపిస్తే నెక్స్ట్ వీక్ రండి. అప్లై చేద్దాం. ఈలోగా ఆయన కూడా అదే అభిప్రాయంలో ఉన్నారేమో కనుక్కోండి. మ్యూచువల్ కన్‌సెంట్ డివోర్స్ అయితే ప్రాసెస్ కొంచెం ఈజీ. ప్రాపర్టీస్, మైంటెనెన్సు, చైల్డ్ కస్టడీ లాంటి విషయాల్లో ఓ అండర్‌స్టాండింగ్‌కి వస్తే చాలు," అంటూ సౌమ్యతో బాటు గేట్ వరకు వచ్చింది లాయర్ విజయలక్ష్మి. ఆమెకి థాంక్స్ చెప్పి వచ్చేసింది సౌమ్య.

*

వాకింగ్‌కెళ్లొచ్చి బాల్కనీ వాలుకుర్చీలో నీరసంగా వాలి పేపర్ హెడ్‌లైన్స్ చూస్తున్నాడు శంకరం. కాఫీతోపాటు ఫోన్ తెచ్చి శంకరం చేతికి అందించింది సౌమ్య. ఫోన్‌లో మావయ్యనించి మూడు మిస్డ్ కాల్స్, రెండు వాట్స్ అప్ మెసేజీలు. ఎవరిదో గృహప్రవేశం ఉందట. వచ్చేవారం వస్తున్నారట.

పక్కింట్లో అరటిచెట్టుకి మరో లేతాకు రూళ్ల కర్రలా చుట్టుకుని పుట్టుకొచ్చింది. బహుశా రేపటికి విచ్చుకుని ఎల్లుండి గాలికి చిరుగుతుందేమో! చెట్టు మాత్రం అలాగే ఉంది పక్కనే ఉన్న పిలకలకి ప్రహరీలా.

లాయర్లిద్దరూ వాళ్లకి విడివిడిగా చెప్పింది కూడా అదే!



# మంచుపల్లకీ







ఫిల్మ్ టెక్నాలజీ పెద్దగా తెలీని చాలామంది డైరెక్టర్లు అద్భుతమైన జడ్జిమెంటుతో స్క్రిప్టులు చేసుకున్నాక డి.ఓ.పి.లమీద ఆధారపడి సినిమాలు తీసి విజయాలు సాధిస్తున్నారు. అసలుకొస్తే పర్ఫెక్ట్ జడ్జిమెంట్ ఉన్న వాడే పర్ఫెక్ట్ డైరెక్టర్ అని ఎప్పుడో చెప్పారు బాల చందర్‌గారు.

ఈ జడ్జిమెంట్‌తోపాటు టెక్నాలజీ మీద కూడా కమేండున్నవాడు ఓ అద్భుతమైన టెక్నీషియన్ కదా? నా దృష్టిలో అద్యుడైనవాడు హిచ్‌కాక్... ఆల్ఫ్రెడ్ జోసఫ్ హిచ్‌కాక్. ఇప్పటి నా పరిస్థితి కాస్త అన్వయించే ఆ హిచ్‌కాక్ ఇన్సిడెంట్ ఒకటి గుర్తుకొస్తుంది.

14 జులై 1966న విడుదలైన టోర్న్ కర్టెన్ సినిమా షూటింగ్ జరుగుతుంది. ఆ యంగ్ సినిమాటోగ్రాఫర్ జాన్ ఎఫ్.వారెన్ని పిల్చిన హిచ్‌కాక్ ఒక వాల్ బాక్ గ్రౌండ్‌లో జూలీ యాండ్రూస్ క్లోజప్ ఎరేంజ్‌చెయ్య మని తనకోసం వేసిన డైరెక్టర్ చైర్‌లో కూర్చుని అర గంటసేపు కునుకు తీసి లేస్తుంటే షాట్ రెడీ చెప్పేడు ఆ జాన్.

"ఓ.కే.ఆర్టిస్ట్‌కి ఇంత దూరంలో ఉందికదూ కెమెరా? లెన్స్ ఎయిటీ టూ కదూ? రేంజ్ ఆర్టిస్ట్ వేసుకున్న షర్ట్ సెకండ్ బటన్ వరకూ ఉంది కదూ?"

"ఎస్ సర్," అన్న ఆ యంగ్ సినిమాటోగ్రాఫర్, ఆయన నాలెడ్జ్‌కి హఠాత్తుగా అదిరిపోయేడు.

నేను చెప్పింది మొత్తం విన్న చంద్ర, "హిచ్‌కాక్ గురించి నువ్వెక్కడో విన్నది చాలా బాగుంది కానీ, ఇప్పుడొస్తున్న డైరెక్టర్లు అంత నాలెడ్జి, అవగాహనతో దిగుతున్నారంటావా?" అన్నాడు.

"డైరెక్టర్‌కి అంత నాలెడ్జి కావాలంటాను."

"ఏవో! నాకు సత్యం చెప్పిందే సబబని పిస్తుంది... నువ్వో అద్భుతం చెయ్యాలి... చెయ్య గలవు... చెయ్యి," అన్నాడు.

"ఏదో ట్రై చేస్తాన్లే... తీరా దిగాక ఏం చెయ్యనూ?" అంటా ఆ ఆర్టిస్ట్ చంద్రగారి దగ్గర నేను డైరెక్టరవ్వడానికి ముందు జరిగిన కథ అలా చెప్పడం పూర్తిచేసేటప్పటికి బయల్దేరే టైమయ్యింది.

*

ఒక్కోసారి ఆలోచిస్తుంటే పదమూడుకీ నా జీవితానికీ ఏదో లింకుంది? అనిపిస్తుంది. ఎన్ని సంద ర్భాల్లో ఎన్ని రకాల పదమూళ్లు? కొన్ని పదమూళ్లు బయటికి చెప్పుకునేవి, కొన్ని ఈ జన్మకి చెప్పుకోలేనివి.

13 ఫిబ్రవరి 1982 ఉదయం సూర్యోదయం అయిన కాసేపటి తర్వాత, హైదరాబాద్ రాజ్‌భవన్

రోడ్ మీద నా జీవితంలో మొట్టమొదటి షాట్ తీసేను.

పర్మిషన్ లేదు కాబట్టి కెమెరాని, ఆర్టిస్ట్‌ని కార్లో ఎక్కించుకునెళ్లి షాట్ తీసేసి వెనక్కి బయల్దేరాం. మేమెక్కి కూర్చున్న కారు ఆవేళ్టి లొకేషనైన ఆ సంజీవ రెడ్డి నగర్ సైడు వెళ్తుంటే గుండెలదోలా కొట్టుకుంటున్నాయి. ఎప్పుడూ లేనంత వేడిగా ఉంది వదుల్తున్న ఊపిరి. ఇంకాసేపట్లో షూట్ మొదలవుతుంది.

ఎలా పని చేస్తానో... ఇవాల్టి సీన్స్ ఎలా తీస్తానో... గజిబిజి మనసు గిజగిజలాడిపోతూంది.

ప్రతిదానికీ కంగారుపడిపోయే నాకు కంగారు లేదుగానీ అదేదో వైరాగ్యం లాంటిది.

యూనిట్‌లో జనం మొత్తం సెటిలై ఉన్న ఆ మండవ గోపాలకృష్ణగారి ఆఫీసు ముందాగింది కారు.

అంతా టిఫిన్లు చేస్తున్నారు.

నా దగ్గరకొచ్చిన ప్రొడక్షన్ అసిస్టెంట్ కాంజీవరం, "మీరు టిఫిన్ తినడానికి కారు షెడ్లో సెటప్ చేసేను," అన్నాడు.

"వద్దు ఏం తినబుద్దవ్వటంలేదు."

"టీ తెమ్మంటారా?"

"పట్రా."

వెళ్లిపోతున్న ఆ కాంజీవరాన్ని క్రాస్ చేసుకుంటా వచ్చిన కెమెరామెన్ హరి అనుమోలు, "తియ్యబోయే సీనేంటి?"అన్నాడు.

"ఆటోలో వచ్చిన ఓ మనిషి అడ్రస్ అడిగి , ఆ తర్వాత మాటా మాటా పెరిగి, గోడమీద కుర్రోళ్లతో గొడవపడ్డాక... రాంగ్ అడ్రస్‌కొచ్చాననుకుంటా వెనక్కెళ్లి పోతుంటే కూరగాయలమ్మే అన్నపూర్ణ ఎదురొస్తుంది."

"ఆటోలో వచ్చేవాడి కారెక్టరేసే మనిషొచ్చాడా? ...మరి మొదలెడదామా?" అంటుంటే ఆ వేషమేసే ఆయన కోసం చూస్తా అసోసియేట్ డైరెక్టర్ దొరసామి రెడ్డిని పిల్చేను.

శంకరాభరణం సినిమాలో బ్రోచేవారెవరురా... అని ఛెండాలంగా పాడి, శంకరశాస్త్రితో తిట్లు తిన్న ఆ నటుడి పేరు కొంపెల్ల గోపాలకృష్ణమూర్తిగానీ క్లోజ్‌గా ఉండే ఏడిద నాగేశ్వర్రావుగారిలాంటి ఫ్రెండ్సు 'శ్రీ గోపాల్' అనేసి పిలుస్తారు. ఆలిండియా రేడియోలో పనిచేసే ఆ శ్రీ గోపాల్‌గారు ఆటోలో వచ్చేవాడి వేషమేస్తున్నారు.

"షాటేంటీ?" అన్నాడు హరి.

"కుర్రోళ్లంతా గోడమీద కూర్చునుంటారు. సందు మలుపు తిరిగిన ఆటో వాళ్లముందుకొచ్చాగు తుంది... టాప్ యాంగిల్. కెమెరా ఎదురింటి డాబామీద పెట్టు," అన్నాను.

"మరీ లాంగైపోద్ది," అన్నాడు హరి.

"అయినా పర్లేదు పెట్టు. లొకేషన్ ఎస్టాబ్లిష్ అవ్వాలి," అన్నాను.

"అవ్వడానికి సినిమాలో ఇదేం ఫస్ట్ సీన్ కాదు గదా?" అంటా డిస్కషన్ పెట్టేప్పటికి అసలే అదోలా గవుతా కారు దిగిన నేను ఇంకేదోలాగయిపోతున్నాను.

కెమెరా నేను చెప్పినట్టు ఎదురింటి డాబామీద పెట్టకుండా ఆటోని ఫ్రేమ్‌లోకి ఎంటర్ చేసి గోడ మీదోళ్లని ఇంక్లూడ్ చేస్తున్నాడు హరి.

మా ఇద్దరి మధ్యా డిస్కషన్ చూస్తున్న తక్కినోళ్లు ఇదేదో గొడవ అనుకుని మా చుట్టూ మూగుతున్నారు.

ఎలాగో ఆ షాటయ్యాక, "తర్వాత షాటేంటీ?" అన్నాడు.

చెప్పాను. వినేసి కళ్లు మూసుకున్నాడు హరి.

"ఏంటీ?" అన్నాను.

"ఊదిరిప్పూక్కళ్ సినిమా చూశావా? దానికి సినిమాటోగ్రాఫర్ మా గురువు అశోక్‌కుమార్," అన్నాడు.



"ఇప్పుడీ ఎండలో ఆ సిన్మా గురించెందుకూ?" అన్నాను.

"ఎందుకంటే ఆ సినిమా అంతా సి.ఎమ్.ఎస్ రేంజ్‌లో తీసేరు. దాంతో ప్రతి ఆర్టిస్టు ఎక్స్‌ప్రెషన్ బ్రహ్మాండంగా రిజిష్టరైంది," అంటా డిస్కషన్ పెట్టే టప్పటికి మా మధ్యలోకొచ్చేస్తున్న ఆర్టిస్టులకి బక్కగా, పొట్టిగా చిన్నకుర్రాడిలా ఉన్న నాకేం పని రాదేమోనన్న డౌట్లొస్తున్నాయి.

*

లకడీకాపూల్‌లో ఉన్న ఆ అశోకాహోటల్లో నాకిచ్చిన రూమ్‌లో కలతిరుగుతున్న నా మనసు పరి పరివిధాల పోతుంది.

ఎందుకా కెమెరామేన్ షాట్ చెబితే చాలు డిస్కషన్ పెడ్తున్నాడు? నాక్కొంత వరకూ టెక్నిక్ తెలీ దన్నమాట నిజమే. కానీ ఇంత ఇదిగానా? షాట్‌షాట్‌కీ మధ్య ఘర్షణలాంటి చర్చా? ఈ సినిమాలో కొన్ని వేల షాట్లుంటాయి. ప్రతీ షాట్‌కీ ఇలాఇటఅతుంటే ఈ చిన్ని బడ్జెట్ సినిమా ఎప్పటికి పూర్తవుతుందీ?

కానీ, సినిమాటోగ్రాఫరైన ఆ హరి అనుమోలు గురించి ఆలోచిస్తే, అతను చాలా ఉత్తముడు. చాలా సంస్కారి. నిత్యం ప్రొడక్ట్ బెటర్‌మెంట్ గురించి తాపత్రయపడే మనిషి. అతనికీ నాకూ ఇదే ఫస్ట్ ఫిల్మ్.

ఇంకో డౌటు.

అతని తెలీనితనం, అతనికొచ్చే డౌట్లూ నామీద గానీ రుద్దుతున్నాడా?... ఈ చిన్ని సమస్యని నేను చాలా పెద్దది చేసి ఆలోచిస్తున్నానా?

ఏంటో!... ఏం అర్థంగాకుండా ఉంది.

ఈ గజిబిజి మనసుతోనే ఏదేదో ఆలోచిస్తుం డటం వల్లనుకుంటాను రాత్రుళ్లు నిద్ర రావటంలేదు.

*

హీరోయిన్ సుహాసినీ, ఈ హరి అనుమోలూ, ఆర్టిస్ట్ ప్రదీప్‌శక్తీ వీళ్లంతా సినిమాటోగ్రాఫర్ అశోక్ కుమార్ దగ్గర అసిస్టెంట్లుగా పనిచేసేరు. సినిమా నాలెడ్జి బాగా ఉన్న సుహాసిని మంచి లౌక్యురాలు. మా చర్చల మధ్యకి రావడంలేదు. ఎవరితోనూ కామెంట్ చేయడంలేదుగానీ దూరం నించి అన్నీ వింటుంది. ఏం విన్నట్టుంటుంది.

ఇంకందరి మీదా డౌట్లుపడ్డం మొదలెట్టిన నాకు చిరంజీవిగారికి మట్టుకి అసలీడు తీసే షాట్లెలా గొస్తాయో అన్న డౌటుండేదేమో అనిపిస్తుంది.

ఇలా షెడ్యూల్ జరుగుతా వస్తుంది.

ఎక్కువ సీన్ల షూటింగ్ ఆ బాదం నాయరాయణ గారి 2RT ఇంటి గోడమీద జరుగుతుంది. ఆ తర్వాత ఈ సంజీవరెడ్డినగర్ ఎంట్రీకి మూలున్న ఆ మెడికల్ షాపులో సుహాసిని మందులు కొంటుంటే నారాయణ రావు చూసే సీను తీసేం. బేగంపేట రైల్వేస్టేషన్ దగ్గర గేటుతీసి లోపలికెళ్తే లాన్ పూలతోట ఎదురుగుండా కనిపించే ఆ రిచ్ బిల్డింగ్ మండవ గోపాలకృష్ణగారి సిస్టరైన ఝాన్సీగారిది. సినిమాలో సాయిచంద్ హౌస్ అది. షూట్ జరుగుతున్నపవిడు మావాళ్లు ఖరీదైన ఆ ఇంట్లో ఏ సామాను పాడుచేసినా పగలగొట్టినా అక్కడి కొచ్చి చూస్తున్న ఝాన్సీగారు, 'పర్లేదు అలాగుం చెయ్యండి మా పనిమనిషొచ్చి తీస్తుంది,' అంటు న్నారు. ఆవిడ భర్త అదే గోపాలకృష్ణగారి బావ శ్రీహరి రావుగారు మాకోసం పొద్దుట తొందర తొందరగా తెములుచ్చుకువెళ్లిపోయి రాత్రి లేటుగా వస్తున్నారను కుంటాను. ఆ ఇంట్లో షూటింగ్ జరిగినంత కాలం మాకు కనిపిస్తే ఒట్టు.

అలాగే వాళ్ల ఫెస్టీల్స్ అండ్ ఫ్యాబ్రికేషన్స్ ఆఫీస్‌లో గిరీష్ లాస్ట్ ఇంటర్వ్యూ సీన్ తీసేం. రచయిత వి. రాజారామమోహన్‌రావు ఆఫీసర్ వేషం వేసేరు.

నారాయణరావుకి అప్పిచ్చే వాళ్ల ఆఫీస్‌లో ఎంప్లాయి వేషం చంద్రకిచ్చి వేషం వేస్తానన్న అతని కోరికనలా నెరవేరిస్తే నవ్వుతా నా భుజమ్మీద చెయ్యేసి, "మరీ బాక్ షాటై పోయింది వంశీ. తెలుసున్నవాళ్లు తప్ప బయటివాళ్లు గుర్తుపట్టరు నన్ను," అన్నాడు.

అది విన్న మా హరి అనుమోలు, "వేషాల్లేవు చంద్ర అన్నయ్యా. మరేం చేస్తాడు?" అన్నాడు.

హాస్పిటల్ వార్డులో వెళ్తున్న లేడీ డాక్టర్ వెనకాలే వెళ్తా ఈ అయిదుగురూ బతిమాలే సీను చదివిన చంద్ర, "దీని షూట్ రేపే అన్నావ్‌గదా?" అన్నాడు.

"ఔను."

"నేను చదివిన జె అండ్ టి యూ బిల్డింగ్ మసాబ్ టాంక్ దగ్గరుంది. దాని పర్మిషన్ తెస్తాను. కారిడార్లో చేద్దాం ఈ సీను," అన్నాడు చంద్ర.

"చిరంజీవి, దేవదాస్ కనకాల కాంబినేషన్‌లో రెండు సీన్లున్నాయి. చిరంజీవిగారు పెయింట్‌వేసే సీనుకి నువ్వు పక్కనే ఉండాలి," అన్నాను.

"అలాగే మరి ఈజిల్ అదీ ఎరేంజ్ చెయ్యాలి గదా?"

"ఔను."

అనుకున్నట్టే అన్నీ కుదిర్నియ్యి. లేడీ డాక్టర్ వేషం లక్ష్మీదేవదాస్ గారేసేరు.

శివం రోడ్డు వెనకాలున్న రైల్వే ట్రాక్ పక్కన జన సంచారం లేకుండా పరమఖాళీగా ఉన్న ఆ రోడ్డులో ఉన్న అహోబిలమఠానికొచ్చేం.

యూనిట్ ఇంకా రాలేదు. చంద్రా నేనూ బయట తిరుగుతున్నాం. ట్రాక్ అవతల దూరం దూరంగా ఉన్న ఆ ఇళ్లని చూపించిన చంద్ర, "వాటిలో ఉన్న ఒక ఇంట్లో రచయిత్రి మాదిరెడ్డి సులోచనగారుంటారు," అన్నాడు.

ఇంకోరోజు పొద్దుట పంజాగుట్ట స్మశానం దగ్గర కొచ్చాం. జనసంచారం తక్కువున్న ఆ ప్రాంతానికి ఎప్పుడో ఒక సిటీ బస్సొస్తుంది. స్మశానం అవతలైతే అక్కడో ఇల్లూ అక్కడో ఇల్లూ తప్ప మొత్తానికి ఖాళీ. రోడ్డుపక్కన, పరమ ఖాళీగా ఉన్న ఆ బస్టాప్ దగ్గర షూట్.

బస్సెక్కుదామని అక్కడికొచ్చిన ఒకమ్మాయి దగ్గరకి చేరిన రాజేంద్రప్రసాదూ, సాయిచందూ ఏడిపించే సీను.

వీళ్ల అల్లరి చూసిన ఆ పిల్ల, "నేనెవరో తెల్సా? డి.ఎస్.పి.గారమ్మాయిని" అంటే, "మేమెవరమో తెల్సా?" అన్నాడు ప్రసాదు.

"ఎవరూ?"

చెబుదామని చాలా బిల్డప్పిచ్చి చివర్లో, "చెబితే బాగోదులే," అంటా సాయిచంద్‌తోపాటు జారిపోయేడు.




ఆ అమ్మాయి క్లోజ్‌షాట్ ఎరేంజ్ చేస్తున్న హరి అనుమోలు, "ఆ ఎగ్రస్ట్రా సప్లయరు గున్నమ్మ ఎక్కడ్నించి తీసుకొచ్చిందో తెలీదుగానీ చాలా బాగుందీ అమ్మాయి," అంటుంటే పక్కనే నిలబడున్న నిర్మాత ప్రసాదరావుగారు, "నాక్కూడా బాగుంది. పేరేంటో?" అన్నారు.

"సోనియా అంట."

ఆ సీనక్కడ చేసేశాక రోడ్డుకి అవతలపక్కనున్న కొండెక్కితే జర్నలిస్ట్ కాలనీ. అక్కడ దారిపక్కనే ఉన్న ఆ పెద్ద పోస్ట్‌బాక్స్‌లో గిరీష్ తన వందో అప్లికేషన్ పోస్ట్ చేస్తుంటే ఆ బాక్సుచుట్టూ చప్పట్లుకొట్టి తిరుగుతా పోస్ట్ బాక్స్‌కి పూజచేసి, పండుగ చేసుకుంటారు ఫ్రెండ్సు.

ఆ సీను షూటింగయ్యేటప్పటికి సాయంత్రమయ్యింది. హైదరాబాద్ మేనేజర్ మాణిక్‌రావుని పిలిచి "నైట్ షూట్ ఉంది," అంటుంటే అక్కడికొచ్చిన ఆర్ట్ డైరెక్టర్ చంద్ర, "సాంగే కదా! అదిగో పక్క వీధిలో ఆ డాబామీద చూసేను లొకేషన్," అన్నాడు.

చీకటిపడ్డాక టిఫిన్ బ్రేకపుడు తియ్యబోయే సాంగ్ వస్తుంది ప్లే బాక్ మిషన్లోంచి.

కొత్తగా వచ్చిన గీత అదే సుహాసినికి కొత్త సంవత్సరం సందర్భంగా స్వాగతం పలికే ఆ పాట 'నీకోసమే మేమందరం, నీ రాకకే ఈ సంబరం, వెల్‌కమ్ వెల్‌కమ్ న్యూఇయర్...' మద్రాస్ లక్ష్మీ కాలనీలో ఉండే రైటర్ గోపీగారితో రాయించేను. అంతకు ముందెప్పుడో ఆయన రాసిన, 'ఇదిగో దేవుడు చేసిన

బొమ్మా,' అన్న పాట నాకు ఇష్టం.

వింటుంటే నా పక్కకొచ్చి నిలబడ్డాడు ఈ పాటకి డాన్స్ మేష్టరైన తార రవి.

మాతోపాటు, యూనిట్ అంతా విన్నాక పరమ నిశ్శబ్దం.

"మీరనుకున్న స్కీము గుర్తు చేసుకుంటున్నారా సార్? ...అదేంటో నాకు చెబుతారా?" అన్నాడు రవి.

అతని వేపు తిరిగిన నేను, "ఈ అయిదుగుర్లో గొప్పగా డాన్స్ చేసేది చిరంజీవిగారే. ప్రతి ఫ్రేమ్ సెంటర్లోనూ అతన్నే పెట్టు. ఎదురింటి డాబా మీంచి సుహాసిని చూసే షాట్స్ కూడా ఉన్నాయ్. సోలోలే గాకుండా కొన్ని కంబైన్డ్ షాట్స్ కూడా తియ్యాలి," అన్నాను.

"ముందా మేడమ్ షాట్స్ తీసేసి పంపేద్దామా?" అన్నాడు రవి.

అప్పుడే అక్కడికొచ్చిన సుహాసిని, "వెళ్లేం చెయ్యను? ఆ అశోకా హోటల్ రూమ్‌లో ఒంటరిగా తెగ బోరుకొట్టేస్తుంది," అంది.

లాక్‌లూజ్ చేసిన జూనియర్ లైట్‌ని పైకి లేపుతున్న హరి "ఉంటదిలెండి లైటింగ్‌లో నాక్కూడా హెల్ప్ చేస్తుంది," అంటా నవ్వుతుంటే, "చేస్తానుగానీ నా మేకప్ పోద్దేమో క్లోజప్‌లున్నాయంట," అంటా అతని దగ్గరకెళ్లింది.

ఆ రాత్రి షూట్ జరుగుతుంటే చిరంజీవి చేస్తున్న మూవ్‌మెంట్లు చూస్తున్న నిర్మాత ప్రసాదరావుగారు,




"ఈయన్లో చాలా గొప్ప స్టైలు కనిపిస్తుంది," అన్నారు సత్యంగారితో.

"ఔను ...నాగేశ్వర్రావుగారి డాన్స్ స్టైల్‌ని లైక్ చేసినట్టు ఇతని స్టైల్‌ని కూడా లైక్ చేయొచ్చు జనాలు," అన్నారు సత్యంగారు.

ఆ రాత్రి డిన్నర్ టైమప్పుడు తింటున్న చిరంజీవి దగ్గరకెళ్లి ఇందాకాళ్లు మాటాడుకున్నది చెప్తే నవ్వేసినా మనిషి, "హోమ్‌వర్క్ చెయ్యకుండా ఎవరికీ ఏదీ సొంతమవ్వదు" అన్నారు.

" ఆ మధ్య మోకాలుకి దెబ్బతగిలినప్పుడు కూడా చాలా హెవీ ప్రాక్టీసు చేశారంట గదా మీరు?" అన్నాను.

నవ్వేసిన చిరంజీవి, "బద్దకించకుండా చేస్తా ఉంటే ఎవరికన్నాసరే తనదంటూ ఒక స్టైలొచ్చేస్తుంది," అంటుంటే ఇదే మాట ఇంకో సందర్భంలో అన్న విజయబాపినీడుగారు గుర్తుకొచ్చేరు నాకు.

"చిరంజీవీ, సుహాసినీ చీరకొనే సీను ఏ షాపులో తీద్దాం?" అనడిగితే కళ్లు మూసుకున్న చంద్ర, "ఒరిజినల్ వెర్షన్లో సీను గుర్తుకొస్తుంది నాకు," అంటా దూరంగా నిలబడున్న సత్యంగారిని తనతోపాటు రమ్మంటా కారెక్కించుకునెళ్లిపోయేడు.

*

అబిడ్స్‌లో కొత్తగా కట్టిన ఆ షాపింగ్ కాంప్లెక్స్ ఫస్ట్ ఫ్లోర్‌లో ఉందా హైకో ఫాబ్రిక్స్ షోరూమ్. దాని గేటు దగ్గర మూగిన ఆ నలుగురు జనం మీద చాలా హడావుడి చేస్తున్న వాచ్‌మేన్ యూనిఫాం వంక చూస్తా లోపలి కెళ్లేను.

లైట్లూ, సౌండ్ సిస్టమూ ఆ షోరూమ్ లోపలి కొస్తుంటే, "బీరువాల అద్దాలు పగుల్తాయి జాగ్రత్త... చెప్పులు బయట విప్పేసి రండి," అంటా అటూఇటూ తిరుగుతున్నాడా షాపు మేనేజరు. హీరో హీరోయిన్లు వచ్చి కూర్చున్నారుగానీ చూడ్డానికొచ్చిన జనం పెద్దగా మూగటంలేదు.

షాపు మేనేజర్ని పిల్చిన సుహాసిని, "కాస్త ఏ.సీ. ఆన్ చేస్తారా?" అంది.

నేను చెప్పిన షాట్ విన్న హరి, "పవర్‌లైన్స్ ఇప్పుడే వేస్తున్నారు. షాట్ రెడీ చెప్పడానికి అరగంట

పైనే పడద్ది," అనడంతో తియ్యాల్సిన సీను గురించా లోచిస్తా కిందకొచ్చి గేటు దాటి ఆ అబిడ్స్ ప్లాట్‌ఫారం మీద నడుస్తా జీపీఓదాకా వెళ్లి అతను చెప్పిన అరగంట తర్వాత వెనక్కి తిరిగేను.

పల్చగా జనం మూగినా గేటు దగ్గరకొచ్చి తియ్య మంటే, "కుదరదు పైన షూటింగ్ జరుగుతుంది," అన్నాడా వాచ్‌మేన్.

"అక్కడికే వెళ్లాలి తియ్యి," అన్నాను.

"లోపల సినిమా యాక్టర్లున్నారు తియ్యడం కుదరదు," అన్నాడు.

"అబ్బా! తియ్యవయ్యా టైమౌతుంది," అన్నాను.

"ఇదిగో అబ్బాయ్! షూటింగ్ జరుగుతుందని చెప్పానా? కావాలంటే సాయంత్రం రా," అన్నాడు.

"ఇప్పుడే వెళ్లాలి," అన్నాను.

"ఏంటంత అర్జంటు?" అన్నాడు.

"నేనా సినిమాకి డైరెక్టర్నయ్యా!" అన్నాను.

పెద్ద షాకు. ఆ తర్వాత చాలా పెద్దగా నవ్వేసిన ఆ వాచ్‌మేన్, వెటకారమైన తన చూపులు నాసైడ్నుంచి మూగిన జనంవేపుకి మార్చి, "చూడండి కామెడీ గాకపోతే, ఈ కుర్రోడు ఆ సినిమాకి డైరెక్టరంట...మనం నమ్మాలంట," అంటా పెద్ద సౌండొచ్చేలాగా నవ్వేస్తున్నాడు.

"గేటు తియ్యి. పైన లైటింగ్ రడీ అయ్యుం టది."

"లైటింగూ లేదు ఫైటింగూ లేదెళ్లెహే."

చిరాకుపెరిగి పోయిన నేను గేటుగొళ్లెంమీద చెయ్యేస్తుంటే మిలటరీలో పనిచేసొచ్చినోడు హిందీలో పెద్దగా అరుస్తా నా మెడ పట్టుకుని గెంటేస్తున్నాడు.

గొడవ పెద్దదైపోయింది.

కిందనుంచి కనిపిస్తున్న ఆ హైకో ఫాబ్రిక్స్‌లోంచి అప్పుడే బయటికొచ్చి సిగరెట్ అంటించిన వేమూరి సత్యంగారికి మా అరుపులు వినిపించినట్టున్నాయి. ఈ పక్కకి తిరిగి చూశాక "ఇదిగో వాచ్‌మేన్! గేటు తెరు. అతను డైరెక్టరు," అంటా అరిచేరు.

అర్జంటుగా అవాక్కైపోయిన ఎక్స్ మిలిటరీవోడు "ఏంటీ! ఈ కుర్రోడు సినిమాకి డైరెక్టరా!!!" అంటుంటే అడ్డి పక్కకి తోసేసి పైకి పరిగెట్టేను.




చీకటిపడ్డానికి ముందే ఆ సీన్ షూటింగైపోయింది.

దగ్గరదగ్గర ఇరవై అయిదు రోజుల షెడ్యూల్ హైదరాబాద్‌లోనే జరిగింది. ఇంకా కొన్ని సీన్లూ, క్లైమాక్సూ, రెండు పాటలూ ఉన్నాయిగానీ తన డేట్లు అయిపోయిన చిరంజీవి ఆవేళ సాయంత్రం ట్రైను కెళ్లిపోయేరు.

దాంతో అన్నీ సర్దేసుకున్న మేంకూడా మద్రాసు బయల్దేరిపోయేం.

*

ప్రొడ్యూసర్ ఎమ్మార్ ప్రసాదరావుగారూ, నేనూ టీ తాగుతుంటే అప్పుడే వచ్చిన సత్యంగారు లోపల్నుం చొచ్చిన ప్రొడక్షన్ చంద్రతో తనక్కూడా టీ తెమ్మని కుర్చీ లాక్కున్నారు.

ఈ సినిమాకి మేం వాడుతున్న ఆ షీల్డ్ మేకర్ రాజాబాదర్ అవుడోర్ యూనిట్లో ఇచ్చిన ఎక్స్‌పోజ్డ్ నెగెటివ్‌ని ప్రసాద్ లాబ్‌లో డెవలపింగ్‌కి ఇచ్చొచ్చేరంట.

"ఈ సినిమాకి ఎడిటర్ అనిల్ అన్నారు గదా?" అన్నారు ప్రసాదరావు.

"అవును వంశీ ఉంటున్న ఇంటికి మూడో ఇంటి మేడమీదుంటాడు అనిల్ దత్తాత్రి అనీ కన్నడం కుర్రాడు," అంటూ చెప్పేరు సత్యంగారు.

"ఈ పేరెక్కడా విన్లేదు ఇంతకుముందేవన్నా చేసేడా?" మళ్లీ అడిగేరు ప్రసాదరావు.

"బాపూగారి ఎడిటర్ మందపాటి రామ చంద్రయ్యగారి అసిస్టెంటు. ఆయన పోయాక 'వంశ

# మీరిచ్చిన స్వేచ్ఛనే ఫాలో అవుతున్నను సర్



Text, design:
సత్యసుందరమ్

వృక్షం' సినిమా ఇతనే చేసేడంట," అంటుండగా టేబుల్ మీద ఫోన్ మోగింది.

లేచెళ్లి మాట్లాడొచ్చిన సత్యంగారు నన్నే చూస్తా, "నీతో మాట్లాడాలి," అన్నారు.

లేచి ఆయనకి దగ్గరగా ఉన్న ఆ కిటికీ చట్రం దగ్గర నిలబడ్డ నేను చెప్పమన్నాను.

"మన హీరోయిన్ ఫాదర్ చారుహాసన్‌గారు ఫోన్ చేసేరు," అన్నారు సత్యంగారు.

"దేనికీ?" అన్నాను.

"లేటెస్ట్ ఎక్విప్‌మెంట్‌తో వాళ్లాఫీసుపైన ఒక ఎడిటింగ్ రూముందంట. ఆ మధ్య రెండు భాషల్లో వాళ్లు తీసిన 'అమావాస్య చంద్రుడు' సినిమా తర్వాత నుంచి ఖాళీగా పడుందంటది. డబ్బుల గురించి పేచీ లేదు. మనల్ని వాడుకోమంటే సరే అనేసేను," అన్నారు.

"సరే అనిల్‌కి చెబుతానీముక్క," అంటుంటే నవ్వుతా నావేపు తిరిగిన నిర్మాత, "ముందో సాంగు ఎడిటింగ్ చేసి చూపించండయ్యా," అన్నారు.

ఆళ్వార్‌పేట జంక్షన్‌లో ఉన్న ఆ కమల్‌హాసన్ పాతకాలం నాటి బిల్డింగ్ ఫస్ట్ ఫ్లోర్లో ఉందాళ్ల ఎడిటింగ్ రూమ్.

మూవీయోలా కొత్తదే, పెద్ద ఎడిటింగ్ టేబుల్ మీది ఎక్విప్‌మెంటంతా కొత్తదేగానీ, వాడకపోవడం వల్ల దుమ్ముపట్టేసుండటంతో పొద్దుటే దిగిపోయిన ఎడిటర్ అనిలూ, అతని అసిస్టెంట్లూ క్లీనింగ్ పన్లో పడ్డారు. వాళ్ల మధ్యలోకి దూరిన నేను, "అసలు మూవీయోలా ఎప్పుడు కనిపెట్టబడింది అనిలూ?" అన్నాను.

పన్లో లీనమైపోయున్న ఆ అనిల్ దత్తాత్రి, "నాకు తెలీదు," అన్నాడు. అతని అసిస్టెంటైన భాషా దగ్గరకెళ్తే నాకూ తెలీదన్నాడతను.

ఫిలిం కటింగ్స్ వేసే బిన్‌లో ఉన్న అమావాస్య చంద్రుడి సిన్మా ఫిలిం ముక్కల్ని ఏరుకుని మేగ్నిఫైయింగ్ గ్లాసులోంచి చూస్తున్న నేను "1917 ప్రాంతంలో ఇంకా హోమ్ ప్రొజక్టర్స్ రానిరోజుల్లో కనిపెట్టిన ఈ మూవీమోలాలో చూసేవారంట సినిమాలు" అంటా మాట్లాడుతుంటే పొద్దుట పదయ్యింది.

"పదండి ఆనంద్ ఉడిపీ భవన్‌లో టిఫిన్ తినేసొద్దాం," అంటా తన కన్నడ యాసలో అన్న ఆ అనిల్ వెనకాల బయల్దేరి కిందికి దిగుతున్నాం.

హాల్లో కూర్చుని ఎదురుగుండా నిలబడున్న మనిషిని తిడుతున్న చారుహాసన్‌గారు నన్ను చూసేటప్పటికి నమస్కారం పెట్టేను.

నవ్వినాయన, "ఇవ్వాల్టినుంచీ మీరు పని మొదలెడ్తారని సత్యన్నారాయణ ఫోన్ చేశారు," అన్నారు.

"అలాగాండీ" అన్నాను.

"హైదరాబాదు షెడ్యూల్ ఎంతవరకూ అయ్యింది, ఎన్ని సీన్లు తీసేరు, ఇంకా ఎంత బాలన్సుంది?" అడుగుతుంటే చెప్పేను.

"తమిళ్ సినిమా టైములో చాలా పర్‌ఫెక్ట్ స్క్రిప్టు తయారయ్యాకగానీ షూట్ మొదలెట్టలేదు మేం. రాబర్ట్, రాజశేఖరన్ అనే అడయార్ ఫిల్మ్ ఇనిస్ట్యూట్ స్టూడెంట్సయిన ఇద్దరు యంగ్ కెమెరామెన్స్ దానికి డైరెక్టర్లు. రోజూ షూటింగ్‌కెళ్లి, వాళ్లు మా స్క్రిప్టు ఏ మాత్రం మార్చకుండా చూసుకుంటా ఉండేవాడిని."

"అలాగా సార్."

"ఔను...తెలుగు వర్షన్ తీస్తూ మీరు కూడా ఏ మాత్రం మార్చి ఉండరు. ఫస్ట్ వెర్షన్ ఎడిట్ చేశాక నేను పైకొచ్చి చూస్తానుగదా?" అనేటప్పటికి నా గుండెలు గుబేల్మన్నాయి. హైదరాబాదునించి దిగిన ఆ యండమూరి వీరేంద్రనాథ్‌గారితో కలిసి చేసిన చాలా మార్పులు అర్జంటుగా గుర్తొచ్చిన నేను అదోలాగయిపోయేను.

ఐపోలేదింకా...

# Enjoy Araku Boomi Instant Coffee

- Arabica Beans from Araku Valley
- Award Winning Beans
- Quality Highly Ranked by Specialty Coffee Association
- No Chicory. 100% Pure Coffee
- Tastes like Filter Coffee

**Available at your local Indian stores.**

araku boomi instant coffee




wecare@boomicoffee.com
boomicoffee.com



కొసరి పాటలు
# కొసరాజు

కొసరాజు పేరు వినగానే రైతుజీవితదర్పణాలవంటి గేయాలు, తాత్త్వికగీతాలు, అజరామర హాస్యగీతాలు, ఇంకా వందలాది పల్లెటూరిపాటలు, జానపదగీతాలు, ప్రబోధగీతాలు సినీ సంగీతప్రియులకు జ్ఞాపకానికి వస్తాయి.

కొసరాజు రాఘవయ్యగారిని తొలుత సినీరంగానికి తన 'రైతుబిడ్డ' సినిమా ద్వారా పరిచయం చేసినవారు గూడవల్లి రామబ్రహ్మంగారు. మలిప్రవేశం, చాలా కాలానికి 'పెద్దమనుషులు' సినిమాతో గానీ జరగలేదు. 'పెద్ద మనుషులు', ఆ తర్వాత 'రాజూ పేద' పాటల విజయం, 'రోజులు మారాయి' సినిమాకు దారితీసాయి. 'రోజులు మారాయి' అఖండ విజయంతో కొసరాజు సినీరంగంలో స్థిరపడ్డారు.

మరో మూడు దశాబ్దాలపాటు, అంటే జీవించి వున్నంతకాలం ఆయన పాటలు వ్రాసినా ప్రథమార్థంలో ప్రధానంగా 1970 ప్రాంతాలవరకూ వచ్చిన కొసరాజు పాటలకు ఉన్న విస్తృతి, వైవిధ్యం, నైగనిగ్యం ఆయనను 'జానపద కవిసార్వభౌమ' బిరుదానికి అర్హుణ్ణి చేశాయి. ఆ పాటలలో మరికొన్నింటిని ఈ వ్యాసంలో చూద్దాం.

## అన్నట్టు ఇవీ ఉన్నాయి - 1

*కొసరాజు పాటల గురించి మూడేళ్ల క్రితం ఈ వ్యాసాలు మొదలు పెట్టినపవిడు ఇంతకాలం ఈ ధారావాహిక కొనసాగుతుందని ఏమాత్రం ఊహించలేదు. అప్పటినుండీ వెదికినకొద్దీ ఎన్నో మంచి పాటలు దొరుకుతూనే ఉన్నాయి. ఎప్పటికపవిడు ఆశ్చర్యం కలిగిస్తూనే ఉన్నాయి. తానాపత్రిక సంపాదకులు, మిత్రులు శ్రీ గొర్తి సాయిబ్రహ్మానందంగారి ప్రోత్సాహం ఉండనే ఉంది. సాధ్యమైనన్ని పాటలను పరిచయం చేయడంతో పాటు, ఆ పాటలకు కారణభూతులైన వ్యక్తులు, సంస్థలు, ఆ వాతావరణం, కథాకమామిషు ఇవన్నీ తెలుసుకునే సరికి ముందు అనుకున్న పది పన్నెండు వ్యాసాలు కాస్తా ముప్పై దాటాయి. ఇక ముగించాల్సిన సమయం ఆసన్నమైంది. అయినా ముందు వ్రాసుకున్న జాబితాల్లో ఉన్నవి, మధ్యలో త్రవ్వకాల్లో బయట పడినవి, నచ్చినవి చాలానే పాటలు మిగిలిపోయాయి. సమగ్రాంధ్ర సాహిత్యం వ్రాసినప్పుడు ఇటువంటి అవస్థలోనే ఆరుద్రగారు 'అన్నట్టు వీళ్లూ ఉన్నారు' అని మిగిలిపోయిన ప్రబంధకవుల చర్చను ముక్తాయించారు. అదే విధంగా స్థూలంగానైనా వీటిలో కొన్ని పాటల గురించి చెప్పకుందాం.*

**పి.యస్.** రామకృష్ణారావుగారు (రామకృష్ణ) భరణీ సంస్థ అధినేతగా, భానుమతి ప్రేమించి పెళ్లాడిన భర్తగా, రత్నమాల, లైలా మజ్ను, విప్రనారాయణ వంటి చిత్రాలు తీసిన మంచి దర్శకుడిగా ప్రఖ్యాతులు. కృష్ణప్రేమ (1943) సినిమాలో ఇద్దరూ కలిసి పని చేసేప్పుడు అది కాస్తా 'రామకృష్ణ ప్రేమ'గా పరిణమించి, భానుమతి కాస్తా భానుమతీ రామకృష్ణ అయ్యారని చిత్ర పరిశ్రమలో చెప్పుకుంటారు.



రామకృష్ణ దర్శకత్వం చేసిన రాజశ్రీవారి శభాష్ రాజా (1961) లో రెండు కొసరాజు పాటలున్నాయి.

రెండూ సుందర్‌లాల్ నహతా, డూండీల ఆస్థాన సంగీత దర్శకుడు ఘంటసాల స్వీయ సంగీతంలో సుశీలతో పాడినవి. మచ్చుకు 'డల్లు డల్లు' అనే వీధి నాట్యం పాట కొన్ని లైన్లు చూడండి.



ఓ షోకైన టీకైన జానీ
రంగైన రంజైన రాణీ
వినవె వినవె
ఓ షోకైన టీకైన జానీ
జాని జాని జానీ - జాని జాని జానీ

డల్లు డల్లు అంతా డల్లు
లోకమంతా ఒట్టి డల్లు
జేబులోన డబ్బు డల్లులే
డల్లుమాట తెలియనీరు
డాబుసరిగ తిరుగుతారు
బయటపడితె గుండెఝల్లులే ॥డల్లు డల్లు॥

ఈ సినిమాలో పాటలన్నీ ఘంటసాల గారి స్థాయిలో చాలా బాగుంటాయి. ఈ పాట భాంగ్రా పద్ధతిలో ఘంటసాల బలేగా చేసారు. కొసరాజు మాటలు చూసి వరస ఊహించవచ్చు.

సారథీవారి ఆత్మబంధువు (1962) సినిమా దర్శకుడు రామకృష్ణగారే. పాటలన్నీ హిట్ అయిన ఈ సినిమాలోని 'చీరగట్టి సింగారించీ', 'మారదు మారదు' పాటలు కొసరాజువే.

ఇవిగాక వాసవి ఫిలింస్ వారికోసం రామకృష్ణ దర్శకత్వం వహించిన అనుబంధాలు (1963) సినిమాలోని మాంచి హాస్యగీతం 'ఇద్దరు అనుకొని ప్రేమించటమే ఆటోమాటిక్ పెళ్లి' సాహిత్యం చూద్దాం.




ఇద్దరు అనుకొని ప్రేమించడమే
ఆటోమాటిక్ పెళ్లి - ఇది ఆటోమాటిక్ పెళ్లి
ప్రేమకు పెళ్లికి మధ్యనవుండే బ్రిడ్జీ ఏమిటో చెప్పు స్లోలీ

డూ డూ డూ డూ బసవన్నాయని
తల వూపడమే పెళ్లి - బాగా తలవూపడమే పెళ్లి
ప్రేమకు పెళ్లికి మధ్యన వుండే బ్రిడ్జీ యిదేను సర్టెన్లీ

భర్తంటే అసలేమిటి? భార్యల డ్యూటీ ఏమిటి?

భార్యాభర్తగా కొంటె జంటగా తిరగడమేలే బ్యూటీ

ఐతె గాడిద బరువూ నెత్తిన వేసీ
చల్ చల్ అంటావేమిటి ॥ఇద్దరు॥

భరింప ఓపిక గలవారూ - సహింప నేర్చిన మగవారూ

ఔనౌను! ఆడవా చాకిరి చేయడానికే
ఖర్మంజాలక పుట్టారు

కాక? ఆడవాళ్లపై అధికారాన్నీ చలాయింప
దిగి వచ్చారా? ॥డూ డూ॥

టీ పార్టీలకు పోతూ మీరు నైలాన్ చీరెలు కడతారూ
భర్తల ముందు పాత చీరెలతో ప్రత్యక్షం ఔతుంటారు!

మీరో! యింట్లో టర్కీటవల్సుతోటీ
తయారుగారా సారూ!

అందుకే! మీరూ మేమూ యింటా బయటా
షోగ్గా వుండాలంటారు

అదే ఆడవారూ అంటార్! ॥ఇద్దరు॥

ఎం.బి. శ్రీనివాస్ సంగీతం చేసిన ఈ పాట పీబీ శ్రీనివాస్, జమునారాణి బాగా పాడారు. భార్యాభర్తలు ఇద్దరూ ఒకరి కోసం ఒకరు అందంగా కనబడే

ప్రయత్నం చెయ్యాలని ఇందులో ముక్తాయించడం ఒక కొత్తదనం. హాస్యగీతాల్లో సామాన్యంగా కనబడని సీరియస్ విషయాలు నెప్పి తెలియకుండా చొప్పించటం కొసరాజు గొప్పతనం. మనసులు కలిస్తే మనువు జరిగినట్టేనని పల్లవిలో అనితరసాధ్యంగా చెప్పడం చూడండి.

అంతస్థులు సినిమాలోని దులపర బుల్లోడా పాటతో భానుమతితో పరిచయం తరవాత నుండీ రామకృష్ణ, భానుమతి ఇద్దరూ గృహలక్ష్మి, అమ్మాయి పెళ్లి, మనవడికోసం వంటి భరణీ వారి సినిమాలలో కొసరాజుతో పాటలు వ్రాయించుకున్నారు.

2

పిఠాపురం పేరు చెప్పగానే గుర్తొచ్చే సోలో పాట, శ్రీకాంత్ ప్రొడక్షన్స్ వారి పిన్ని (1967) సినిమాలోని 'సైకిల్ పై వన్నెలాడి పోతున్నదీ' కొన్ని లైన్లు చూద్దాం.



సైకిలుపై వన్నెలాడి పోతున్నదీ
రయ్యిమని పిట్టలాగ పోతున్నదీ ॥సైకిలుపై॥

అసలైన లేడిలాగా
సిసలైన షోకిల్లాగా
బెల్‌గొట్టి పోతున్నదీ పిల్లా
బేజారు చేస్తున్నదీ అహో ॥సైకిలుపై॥

నడుమంతా మలచుకోని
నాజూకు పెంచుకొని
రోడ్డంతా నాదన్నదీ పిల్లా
అడ్డాలు లేవన్నదీ అయ్యొయ్యొ ॥సైకిలుపై॥

రాజబాబు, విజయనిర్మలల మీద ఈ పాట చిత్రించింది, ఎవరో కాదు బియ్యే సుబ్బారావు. టీవీ రాజు వరసా, కొసరాజు మాటా పోటాపోటీగా ఉంటాయి ఈ సూపర్ హిట్ పాటలో.

ఇటువంటి ఆకతాయి టీజింగ్ పాటలలో మరో ప్రసిద్ధ గీతం విశ్వభారతీ వారి శ్రీమంతుడు (1971) సినిమాలోని 'బులిబులి ఎర్రని బుగ్గలదానా.'



బులి బులి ఎర్రని బుగ్గలదానా
చెంపకు చారెడు కన్నులదానా
మరచిపోయావా - నువ్వే మారిపోయావా
అయ్యో మరచిపోయావా - నువ్వే మారిపోయావా

చెడ్డదారిలో తిరిగానే - నీ
చెంపదెబ్బలే తిన్నానే
మంచిమాట నీ నోట వినాలని
మనసు మార్చుకొని వచ్చానే వచ్చానే ॥బులి॥

బొమ్మల పెళ్లి చేశావే - ఈ
బొమ్మకు హారం వేశావే
చచ్చి బ్రతికి నీ చెంతకు వస్తే
నన్నే కాదని అంటావే అంటావే ॥బులి॥

ఎవడో రాజా నఅంటావే - నీ
రాజా నే కాదంటావే
కళ్లు తెరుచుకో నిజం తెలుసుకో
కావాలంటే పరీక్ష చేసుకో చూసుకో ॥బులి॥

నేను మారిపోయాను కావాలంటే చూడు అని ఏయన్నార్ జమున వెంటపడే కథోచితమైన ఈ పాటకు సంగీతం టి. చలపతిరావు. ప్రత్యగాత్మ దర్శకత్వం.

3

అన్నపూర్ణా వారి సినిమాల్లో విచిత్రబంధం (1972) అన్న విచిత్రమైన సినిమా దుక్కిపాటివారిమీద వ్యాసాలలో అప్పుడు మనం చూడలేదు. మహదేవన్ స్వరబద్ధం చేసిన 'చిక్కావు చేతిలో చిలకమ్మా' ఈ సినిమాలోని కథను ముందుకు తీసుకెళ్లే మరో ఆట పట్టింపు పాట కొంత భాగం చూడండి.



చిక్కావు చేతిలో చిలకమ్మా- నీవు
ఎక్కడికీ పోలేవు ఆగవమ్మా
నీ కోరచూపు చూచి- బెదరిపోదునా
కస్సు బుస్సు మనగానే- అదిరిపోదునా
పొగరంతా అణిగిందా- బిగువంతా తగ్గిందా
తప్పు ఒప్పుకుంటావా- చెంపలేసుకుంటావా ॥చిక్కావు॥

కల్లబొల్లి మాటలతో కైపెక్కిస్తావా
హొయలు వగలు చూపించి వల్లో వేస్తావా
నాటకాలు ఆడేవా నవ్వులపాలు చేసేవా
నీ టక్కులు సాగవమ్మా నీ పప్పులు ఉడకవమ్మా ॥చి॥

గాయకుడు రామకృష్ణ మొదటిసారి అక్కినేనికి పాడటం ఈ సినిమాతోనే. కొసరాజు పాట ఆయన పాడటం కూడా ఇదే మొదటిసారి. రామకృష్ణ తరవాత రోజులలో పాడిన కొసరాజు పాటలు అందాలరాముడు, యశోదకృష్ణ, వేములవాడ భీమకవి, వినాయక విజయం మొదలైన సినిమాలలోనివి ఇంతకుముందు వ్యాసాలలో కొన్ని చూశాం. ఇక రామారావు తీసిన బ్రహ్మంగారి చరిత్రలోని పదికి పైగా కొసరాజు పాటలు సుసర్ల దక్షిణామూర్తి సంగీతంలో రామకృష్ణే మధురంగా ఆలపించారు. (బాలసుబ్రహ్మణ్యం ధాటికి తట్టుకోలేక నలిగిపోయిన రామకృష్ణకు తాను సినిమాలు తీసినంత కాలం ఎన్టీఆర్ అవకాశాలు ఇవ్వటం నచ్చిన కళాకారుల పట్ల ఆయన నిబద్ధతకు నిదర్శనం.)

ఏరువాక సాగారో పాటకు నర్తించి విపరీతంగా పేరు తెచ్చుకున్న వహీదా రహమాన్ ఎన్ఏటి వారి జయసింహ (1955) తర్వాత గురుదత్ పుణ్యమాని తెలుగు పరిశ్రమకు దూరమై హిందీరంగంలోకి వెళ్లి పోయిన వైనం సినీజీవులకు తెలిసిందే. ఒకసారి దుక్కిపాటి మధుసూదనరావుకు ఎయిర్‌పోర్ట్‌లో తారస పడి ఈ ప్రస్తావన వచ్చినప్పుడు, 'నేను తెలుగమ్మాయినే కదా, తెలుగులో అవకాశాలు వస్తే చేయాలని ఉంది,' అన్నారట. అలా అన్నపూర్ణావారి బంగారు కలలు (1974) సినిమాలో ఒక ముఖ్యపాత్ర ఆమెకు లభించింది.

వహీదా మీద చిత్రించబడ్డ టైటిల్ సాంగ్ 'సింగారం చిందులు వేసే అమ్మాయిల్లారా' చిన్న చిన్న తేడాలతో సినిమాలో రెండుసార్లు వస్తుంది. రెండూ కొసరాజే వ్రాసారు. రెండో పాట వహీదా చేసిన నృత్యానికి వ్రాసినది చూద్దాం.

రాజేశ్వరరావు సంగీతంలో సుశీల పాడిన ఈ పాట చిన్నప్పుడు రేడియోలో చాలాసార్లు వచ్చేది. సింగారం చిందులు వేసే అన్నది మంచి ప్రయోగం. కలల ప్రపంచంలో బ్రతికే సుమసుకుమారులైన అతివలకు జాగ్రత్తలు చెప్పే సాహిత్యం కూడా బాగుంటుంది.



సింగారం చిందులు వేసే అమ్మాయిల్లారా
బంగారుకలలేకంటున్నారా

పూలబాటగా భ్రమిసేరు
ముళ్లబాట నడిచేరు
వలపుపొంగు వయసులోన
కన్ను మిన్ను కానలేరు
హద్దుమీరి తిరిగారంటే
అల్లరి పాలైపోతారు ॥సింగారం॥

విరబూసిన పువ్వులాంటిది అతివ జీవితం
మనసిచ్చిన భర్త దొరికితే అదే మధుర జీవితం

పడరాని చేతిలో పడితె
అదే వెతల జీవితం
అదే వెలితి జీవితం
అంధకార బంధురం
కలతలున్న సంసారాలు
రాలిపోయి వాడిన పూలు ॥సింగారం॥

ప్రాణమున్న పువ్వులే పడుచుపిల్లలు
అనురాగమే సుగంధం - త్యాగమే తియ్యని మకరందం
సొగసులే రంగులు - సోయగాలే ఆకర్షణలు

లోకం పోకడ తెలియకపోతే
మోజుల్లో పడి ముందుకుపోతే
బ్రతుకు భారమైపోతుంది
చివరకు కన్నీరే మిగులుతుంది ॥సింగారం॥

4

ఈమధ్య కౌబాయ్ సినిమాలకు ఆద్యుడిగా కృష్ణకున్న పేరును సవాల్ చేస్తూ శోభన్‌బాబు నటించిన దెబ్బకు ఠా దొంగలముఠా (1971) ఇంకా ముందే వచ్చిందని వాదించాడొక మిత్రుడు. మోసగాళ్లకు మోసగాడు కన్నా ఈ సినిమా మూడు నెలలు ముందే వచ్చింది. శోభన్ గెటప్ దేశవాళీ కౌబాయ్ లాగానే టోపీ, పిస్తోలుతో సహా ఉంటుందిందులో.

దేవదాసు, కన్యాశుల్కం, ఏకవీర లాంటి క్లాసిక్స్ తీసిన డి.ఎల్. నారాయణ ఈ సినిమా నిర్మాత అంటే విధి బలీయం అనిపించక మానదు.

ఇందులో కొసరాజు వ్రాసిన తమాషా పాట 'ఎవురివి బావా ఏందిది బావా' కొన్నిలైన్లు చూద్దాం.



ఎవురివి బావా - ఏందిది బావా
మెత్తనిదాన్ని - ఒత్తకు బావా

సరిసరిలే - తెలుసునులే - బెదరకు
నీకేల ఈ బెంగ నీవాణ్ణిలే నేను ॥ఎవురి॥

సిలిపిగ కళ్లూ సూత్తుండాయీ
సేతులు ఏమో సేత్తుండాయీ

గడసరిగా - పెడసరిగా
నడవనులే - విడవనులే
సరిసరిలే - తెలుసునులే - బెదరకు
నీ సిగ్గు పోదల వచ్చానులే నేను

ఈ పాటకు సంగీతం బి. శంకర్. పల్లెపిల్ల బిజిలీ (వాణిశ్రీ) మాటలయాసకు, హీరో ప్రతాప్ (శోభన్ బాబు) మాటలకు ఉన్న తేడా చూడండి. సంగీతం కూడా జానపద పాశ్చాత్య బాణీల్లో ఇద్దరికీ వైవిధ్యంగా ఉంటుంది. ఇందులోనే 'అప్పన్న కొండ కాడికెపవి డెళ్లిన గాని' అనే మరో కొసరాజు పాట కూడా ఉంది.




ఇదే సంవత్సరం శోభన్ హీరోగా వచ్చిన మరో చిత్రం పూర్ణా అర్ట్ పిక్చర్స్ కూతురు-కోడలు (1971)కు గానూ

వింత వింత లోకంలో
ఎంతెంతో తిరిగానూ
కళ్లు తెరచి చూచానూ
నిజం తెలుసుకున్నాను
నాదన్నది ఏమీ లేదూ
నా అనువారెవరూ లేరూ

నా దేశమే నా యిల్లూ
మనుషులంతా నావాళ్లూ
కళ్లు తెరచి చూశానూ -
నిజం తెలుసుకున్నాను ॥వింత॥

బ్రతుకుబాటలో ఎన్నో ఎన్నో
ఎదురుదెబ్బలు తిన్నానూ
అదరక ఉన్నానూ
ధీమాగా ఉన్నాను
కష్టముంటే కలవరపడను
అంతా నా మంచికని
అడుగు ముందుకేస్తానూ
కళ్లు తెరచి చూచానూ
నిజం తెలుసుకున్నాను ॥వింత॥

మహదేవన్ స్వరబద్ధం చేసిన మంచి గీతం 'వింత వింత లోకంలో' కూడా కొంతభాగం చూద్దాం.

అర్థవంతంగా కొసరాజు వ్రాసిన, బాలు తన లేత గళంతో భావగర్భితంగా పాడిన ఈ పాట అప్పట్లో బాగా వినిపించేది.

## 5

చలనచిత్ర వారి మహమ్మద్ బిన్ తుగ్లక్ (1972) మన సినిమాల్లో అరుదుగా కనిపించే రాజకీయ అధిక్షేప కథాచిత్రం. 'చో' రామస్వామిగా తమిళనాట ప్రసిద్ధుడైన రచయిత, నాటకకర్త, నటుడు, తుగ్లక్ పత్రిక సంస్థాపకుడు శ్రీనివాస అయ్యర్ రామస్వామి వ్రాసిన నాటకం ఆధారంగా తమిళంలో 1971లో వచ్చిన ఈ సినిమా తరవాతి సంవత్సరం తెలుగులో నిర్మించారు. ఇందులో నాగభూషణం, కృష్ణంరాజు, రమాప్రభలకు చాలా మంచి పాత్రలున్నాయి.



మరో ప్రత్యేకత యస్పీ బాలసుబ్రహ్మణ్యం ఇందులో ఒక పుట్టినరోజు పార్టీలో పాడుతూ తానుగానే కనబడటం.

హాపీ బర్త్ డే టు యూ
హాపీ బర్త్ డే టు యూ
దేశం కోసం మీ తండ్రెంతో
దీక్షతో త్యాగం చేశాడు
ప్రజాసేవకై కుటుంబమంతా
పలుబాధల పాలైనారు
నాయకీ శుభదాయకీ
జేజేలు మహర్జాతకీ ॥హాపీ॥

హల్లో హల్లో చూడం
అధికారం నీ సొత్తు
కాదన్న వాడి పని చిత్తు
వేసేస్తావులే ఎత్తుకు ఎత్తు
మెచ్చేరు జనం యావత్తూ
వండర్‌ఫుల్ నీ లైఫూ
నీవుంటే మాకూ సేఫూ ॥హాపీ॥

స్త్రీజాతంతా నిన్ను చూసుకొని
చిందులు త్రొక్కుతు వున్నదీ
బీదసా ఉద్ధరింతువనీ
నోళ్లు తెరచి చూస్తున్నదీ
నాయకీ శుభదాయకీ
జేజేలు మహర్జాతకీ ॥హాపీ॥

నిన్ను నమ్ముకున్నాము
నీవెంట తిరుగుతున్నాము
అవకాశం ఉన్నప్పుడు
మరువవద్దు మమ్మెప్పుడు
నాయకీ శుభదాయకీ
జేజేలు మహర్జాతకీ ॥హాపీ॥

సాలూరి హనుమంతరావు స్వరపరచిన ఈ కొసరాజు గీతం 'హేపీ బర్త్ డే టూ యూ' లో బాలూ గమక విన్యాసాలు బాగుంటాయి.

ఒక స్వాతంత్ర సమరయోధుడి కూతురు (రమాప్రభ) చుట్టూ తమ ప్రయోజనాలకోసం చేరి ఆమె పుట్టినరోజు వేడుక చేస్తారు కొందరు అవకాశవాదులు. ఆవిడే స్త్రీ జాతిని చిందులు తొక్కించే నాయకి, శుభ దాయకి, మహర్జాతకి. సినిమాలోని వ్యంగ్యానికి తగ్గట్టు కొత్తగా ఉంటాయి కొసరాజు ప్రయోగించిన మాటలు.

శ్రీ గౌతం పిక్చర్స్ వారి వాడే-వీడు (1973)కు సత్యం మంచి సంగీతం అందించారు. పాంచకడీదేవ్ ప్రఖ్యాత డిటెక్టివ్ నవల వాడే-వీడుకు ఈ సినిమా కథకు సంబంధంలేదు. ఇందులో రామారావుకు ఘంటసాల, బాలు ఇద్దరూ పాడారు. మారుతున్న కాలానికి సూచనగా రామారావుకు బాలూ పాడిన క్లబ్ సాంగ్ 'లవ్‌లోనే ఉందిలే లోకమంతా' ప్రేమే సర్వస్వమని సరదాగా చెప్పే పాట- కొన్ని పంక్తులు చూడండి.

*లవ్‌లోనే ఉందిలే లోకమంతా*
*అది లేకపోతే చీకటిలే జీవితమంతా ॥లవ్॥*

*ఆకలి కొఱకై అంగలార్చు నిరు*
*పేదలో వుంది లవ్*
*ఐశ్వర్యంతో విర్రవీడు దొర*
*బాబులో వుంది లవ్...*
*ఇది 'లౌవ్'లో వున్న మహత్తు*
*ఇందులో వుంది గమ్మత్తు*
*ఆ మోజు మనసులో పడ్డది అంటే*
*ఎంతవాడయినా గల్లంతు! ॥లవ్॥*



శ్రీభాస్కరచిత్ర వారి మనుషుల్లో దేవుడు (1974) ఎన్టీ రామారావు సన్నిహితుడు, బంధువు అట్లూరి పుండరీకాక్షయ్య నిర్మించిన చిత్రం. పై పాటలలాంటి పార్టీ పాట 'హల్లో మేడం మిస్టర్ రావ్ ఇప్పుడే వచ్చారు' లో రామారావును హిప్పీ తలకట్టుతో చూస్తాం. అప్పటి తరం కోసం ఆయనను కొత్తగా చూపించే ప్రయత్నాలు ఆ సమయంలో జరుగుతున్నాయని ఈ పాటలు చూస్తే తెలుస్తుంది. హల్లో మేడం పాట కొన్ని పంక్తులు చూడండి.



*హల్లో మేడమ్! హల్లో మేడమ్!*
*హల్లో మేడమ్ మిస్టర్ రావ్ ఇప్పుడే వచ్చారు*
*నీ పుట్టినరోజు పండుగవేళకు ఇదిగో వచ్చారు ॥హల్లో॥*
*మదరాసు నుండి మాస్కోదాకా*
*డెన్మార్కు నుండి న్యూయార్కు దాకా*
*బెజవాడ నుండి బెర్లిన్‌దాకా*
*పంజాబు నుండి ప్యారిస్‌దాకా*
*దేశాలన్నీ తిరిగాను-మోసాలెన్నో చూశాను*
*జనరల్ నాలెడ్జిలో నేను డాక్టరేటు కొట్టేశాను ॥హల్లో॥*

పైన చూసిన మూడు పాటలు ఇంగ్లీషు మాటల తోనే మొదవటం గమనార్హం. అన్య దేశ్యాలు వాడటం కొసరాజుకు కొత్త కాకపోయినా డెభ్భైలలో మారుతున్న అభిరుచుల వల్ల ఇది కొద్దిగా ఎక్కువ అయ్యిందేమో అనిపిస్తుంది.

## 6

దాసరి నారాయణరావు దర్శకరత్నగా పేరు తెచ్చుకోవడానికి ఆయన అత్యధిక సంఖ్యలో దర్శకత్వం

రాతిరి రాతిరి వస్తావని చందమామయ్యో
రాతిగంధం తీసి వుంచితి చందమామయ్యో
చందమామయ్యో మామ చందమామయ్యో
రాతిరి నువ్వు రాకపోయె రాతిగంధం ఇంకిపోయె

రగులుకున్న నా వలపంతా దిగులుతోటి దిగబడిపోయె
కట్టుకున్న చీర నలిగె పెట్టుకున్న బొట్టు చెరిగె
కంటికి దిద్దిన కాటుక కరిగె తెలియరాని గుబులు పెరిగె

చూపులతోటె తెల్లవారె చుక్కలన్నీ చల్లగ జారె
ఎదురుగా నిను చూస్తుంటే ఎన్నెన్నో కోరికలూరె





వహించిన సినిమాల రాశి ఒక కారణమైతే అగ్రనాయకులందరితో ఆయన తీసిన సూపర్ హిట్ చిత్రాలు మరో కారణం. ముఖ్యంగా తన అభిమాన హీరో అక్కినేని కథానాయకుడిగా ఆఖరులో మరో కొన్ని సంవత్సరాలు కొనసాగటానికి దాసరి తోడ్పాటు ఎంత ఉందో తెలిసినదే.

అయితే ఆయన తీసిన సినిమాల్లో ఎక్కువభాగం చిన్న సినిమాలే. మధ్యతరగతి జీవితాలలోని విషయాలు సమస్యలు ఆధారంగా తక్కువ ఖర్చుతో చిన్న హీరోలతో తక్కువ వ్యవధిలో తీసిన ఈ సినిమాలవల్ల ఎంతోమందికి అవకాశాలు కూడా వచ్చాయి. చిన్న సినిమాలకు మార్కెట్ క్రమంగా కనుమరుగవటం, వాటి వల్ల పరిశ్రమకు వచ్చిన నష్టాలపట్ల చాలాసార్లు ఆవేదన వ్యక్తం చేసేవారు దాసరి.

ఇదే కోవలో 1977లో వచ్చిన లలిత మూవీస్ వారి ఇదెక్కడి న్యాయం ఒక అమ్మాయికి తన కన్నవారి కుటుంబం పట్ల ఉన్న బాధ్యత, తద్వారా ఆమె వైవాహిక జీవితంలో వచ్చిన ఒడిదుడుకులు ఇతివృత్తంగా వచ్చిన చిత్రం. ఇందులో కొసరాజు 'రాతిరి రాతిరి వస్తావని' అన్న అందమైన పాట, ఒక హరికథ వ్రాశారు.

'రాతిరి రాతిరి వస్తావని' విలన్ మోహన్‌బాబు, ముగ్ధలాంటి జయమాలినిని వలలో వేసుకునే పాట. అతను వీడియో తీస్తుంటే ఆమె అతని కోసం ఆడి పాడుతుంది. ఈ సన్నివేశానికి కొసరాజు వ్రాసిన సాహిత్యం జాను జానపద సోయగంతో ఎంత అందంగా ఉందో చూడండి. ఇటువంటి పాట వ్రాయించుకుని రాజేశ్వరరావు వంటి స్రష్టతో సంగీతం చేయించుకోవడంలో దాసరి అభిరుచి అర్థమవుతుంది.

దాసరి నారాయణరావుతో కొసరాజు ప్రయాణం దాసరి మొదటి సినిమా తాతా-మనవడు (1973) నుండి బ్రహ్మముడి (1985) వరకూ దాదాపు ఇరవై పాటల పాటు సాగింది. వీటిలో 'ముత్యాలు వస్తావా' (మనుషులంతా ఒక్కటే - 1976) లాంటి అధిక జనాదరణ పొందిన పాట, 'కీచుకీచు పిట్టా నేలకేసి కొట్టా' (విశ్వరూపం - 1981) లాంటి పక్కా మాస్ పాట, మొదలైనవి ఉన్నా పైన చూసిన రాతిరిరాతిరి పాట అత్యుత్తమమైనదని ఘంటాపథంగా చెప్పవచ్చు.

## 7

1977లోనే వచ్చిన ఆదర్శ చిత్రవారి మా ఇద్దరి కథలోని 'చిలకపచ్చ చీర కట్టి' ఈ సమయంలో వచ్చిన మరో బహుచక్కని కొసరాజు పాట.

గానకోకిల సుశీల గొప్ప సోలోలలో ఈ పాట ఉండి తీరుతుంది. చక్రవర్తి ఇంకా మాస్ పాటల లోతులలో కూరుకుపోక ముందు చేసిన ఎవ్వరైనా పాడుకోదగ్గ



చిలకపచ్చ చీరకట్టి చేమంతిపూలు పెట్టి
షోకు చేసుకొచ్చానురోయ్ ఓరయ్యో!
చుక్కలాంటి చిన్నదాన్నిరోయ్! ఓరయ్యో
ఒక్కదాన్ని వచ్చానురోయ్

ఆ... ఎర్రా ఎర్రనివాడు...
ఆ... ఎత్తుభుజాలవాడు
చూడా చక్కనివాడు దారీతప్పి వచ్చాడు ॥ఎర్రా॥
ఎవరూ చూడలేదా! చూస్తే చెప్పరాదా ॥చిలక॥

గుంటూరు చిన్నవాడు కొంటే కోణంగివాడు
పక్కాపాపటివాడు పచ్చీ పోకిరీవాడు ॥గుంటూరు॥
ఏడ దాగినాడో జాడ తెలియనీడూ ॥చిలక॥

చక్కని వరస. చిన్నప్పుడు మా తాతగారి ఊళ్లో చీమిడి ముక్కు బుడ్డాళ్లు ఈ పాట పాడటం గుర్తు.

కొసరాజు సాహిత్యం, సంగీతం, గానం అన్నీ భలేగా కుదిరిన ఈ పాట తెరమీద మంజుల నర్తించి, అభినయించిన తీరు చూస్తే ఆమెకు రావలసిన పేరు రాలేదా అనిపిస్తుంది. అందరూ ఈమె డాన్సు చూస్తుంటే మరొకడు వారి జేబులు కొడ్తూ ఉంటాడు. దానికి తగ్గట్టే ఆమెకిచ్చిన స్టెప్పులు కూడా మాస్ రకంగా ఉన్నా మంజుల మంజులమైన కదలికల వల్ల బాగుంటాయి.




పాయి పాయి పాయి ప్పప్పప్ప పాయి పాయి
రావే పార్వతి
హాయి హాయి హాయి కలుపు చేయి చేయి
నిన్నే కోరితి
ఐ లవ్ యు ఓ మై డార్లింగ్ ॥పాయి॥

నీ సొగసు చూసి నే వలచినాను
నిదురమాని నిను పిలిచినాను
రూములో దూరి - ఒంటిగ చేరి
టైమంత వేస్టు చేస్తావు
ఎందుకు పరీక్ష చేస్తావు ॥పాయి॥

అందాల భామ ఓ చందమామ
ఇద్దరమొక్కటై విహరించుదామా
తలుపు తెరువు - ఎదురు నిలువు
కం కం లేడీ కమాను లేడీ
నా వళ్లంత వేడి వేడి ॥పాయి॥

అదే సంవత్సరం (1977) వచ్చినది, చిన్నప్పుడు విన్నప్పుడు విచిత్రంగా అనిపించినది, ప్రేమ్స్ కంబైన్స్ వారి సంసారంలో సరిగమలు లోని 'పాయి పాయి పాయి రావే మాలతీ'.

ఈసరికి యస్పీ బాలసుబ్రహ్మణ్యం కంఠం పరిణితి చెంది ఉచ్ఛదశకు చేరుకుంది. యావత్ దక్షిణ భారతంలో ఎదురులేని గాయకుడైనాడు. శంకర్-గణేశ్ సంగీతంలో బాలు తను మాత్రమే పాడగల విధంగా పాడిన ఈ పాటతో ఈ వ్యాసం చాలించి మరికొన్ని పాటలతో వచ్చేసారి కలుద్దాం.

(సశేషం)



శ్రీ అట్లూరి & జంపతి

# 2022లో మెరుపుకలలు

***రెండేళ్లుగా కరోనా సినిమా ప్రపంచపు ఆశలను, అంచనాలను గల్లంతు చేసింది. రెండేళ్ల క్రితమే విడుదల కావాల్సిన అనేక పెద్ద చిత్రాలు వాయిదా పడుతూ పడుతూ ఎట్టకేలకు 2022లో మోక్షం పొందనున్నాయి. ఒకటా... రెండా.. వందల కోట్ల పెట్టుబడితో రూపొందిన చిత్రాలు మరి. జనవరి మొదటివారం నుంచే వరుస కట్టనున్నాయి. కరోనా కాలానికి ముందు తెలుగునాట ప్రతి ఏడాది 150 నుంచి 200 చిత్రాలు విడుదల అయ్యేవి. 2022లో ఎన్ని రానున్నాయో ఇపవిడే చెప్పలేం కానీ వచ్చే వాటిలో దాదాపు 20 వరకు పెద్ద చిత్రాలే ఉండడం విశేషం. అవేవో ఒకసారి చుద్దాం.***

## ఆర్ ఆర్ ఆర్

2022కి బోణి కొడుతున్న చిత్రం ఒక భారీ మూవీ కావడం విశేషం. నాలుగేళ్ల క్రితం ఆర్ ఆర్ ఆర్ సినిమాని ప్రకటించిననాడే ప్రేక్షకులు ఈ సినిమాని చూడాల్సిందే అని మెదడులో నోట్ చేసుకున్నారు. అందుకే, ఈ సినిమా ఎంత ఆలస్యమయినా, ఎన్నిసార్లు వాయిదపడ్డా జనంలో అంచనాలు తగ్గలేదు. ఎప్పుడెప్పుడు చూద్దామా అనే ఆరాటం పోలేదు. రాజమౌళి... ఈ పేరు చాలు ఒక సినిమాపై అంచనాలు పెరగడానికి. అవి మరింతగా పెరిగాయిప్పుడు. 'నాటు నాటు...' అంటూ ఎన్టీఆర్, రామ్ చరణ్ ఒకే ఫ్రేమ్‌లో వీరంగం వెయ్యడంతో అంచనాలు ఆకాశాన్ని అంటాయి.

తెలుగు సినిమా స్థాయిని అమాంతం పెంచిన దర్శకుడు రాజమౌళి. ఈరోజు దేశమంతా తెలుగు సినిమారంగంపై చూపు వేసిందంటే కారణం ఆయన సృష్టించిన బాహుబలి చిత్రాలే. బాక్సాఫీస్ చరిత్రని తిరగరాసిన సినిమాలవి. ఈ కరోనా కాలంలో కూడా ఈ సినిమా థియేటర్ల వ్యాపారం వందల కోట్లలో జరిగింది అంటే కేవలం రాజమౌళి పేరు వల్లే.

దాదాపు 400 కోట్ల రూపాయలతో తెరకెక్కిన ఈ చిత్రం... స్నేహం చుట్టూ తిరిగే దేశభక్తి చిత్రం. అల్లూరి సీతారామరాజు, కొమురం భీమ్ మన తెలుగునాట పేరొందిన సమరయోధులు. అల్లూరి సీతారామరాజు



బ్రిటిష్ దొరలను ఎదిరించి ప్రాణత్యాగం చేశారు. కొమురం భీమ్ నిజాం రాజులపైకి ఎక్కుపెట్టిన వీర బల్లెం. వీరిద్దరూ దోస్తీ కడితే ఎలా ఉంటుందనే ఆలోచనతో రాజమౌళి తీసిన సినిమా ఆర్ ఆర్ ఆర్.

కళ్లు చెదిరే పోరాట దృశ్యాలు, గ్రాఫిక్స్, ఎన్టీఆర్, రామ్‌చరణ్ నటన, వారి మధ్య స్నేహబంధం ఈ సినిమాకి ప్రధాన ఆకర్షణలు. ఎలాంటి కథనైనా కట్టి పడేసేలా చెప్పడం రాజమౌళి శైలి. 2022 గొప్పగా ప్రారంభం అవుతుంది అని కచ్చితంగా చెప్పొచ్చు.

విడుదల తేదీ: జనవరి 7, 2022.

## భీమ్లా నాయక్

సంక్రాంతి బరిలో నిలుస్తోన్న మరో అగ్ర కథా నాయకుడి చిత్రం భీమ్లానాయక్. పవన్‌కళ్యాణ్ సినిమా అంటే ఆ కిక్కే వేరు. అభిమానులు ఊగి పోతారు. 2021లో వకీల్ సాబ్‌గా మెప్పించిన పవన్ కళ్యాణ్ కొత్త ఏడాదిలో మొదట్లోనే భీమ్లానాయక్‌గా మన ముందుకొస్తున్నారు. దాదాపు 110 కోట్ల రూపాయ లతో తెరకెక్కిన చిత్రమిది.

భీమ్లానాయక్ కూడా ఆర్ ఆర్ ఆర్ లా మల్టీ స్టారర్. కాకపోతే పవన్‌కళ్యాణ్‌లా పెద్ద హీరో కాదు. రానా మరో కథానాయకుడిగా నటించారు. మల యాళంలో విజయవంతమైన అయ్యప్పనుమ్ కోషియం ఆధారంగా తెరకెక్కిన ఈ కథ ఒక పోలీస్ అధికారి, ఒక జవాన్ మధ్య సాగుతుంది. పోలీసుగా పవన్‌కళ్యాణ్, హవాల్దార్‌గా రానా నటించారు. ఇద్దరూ పొగరుగిత్తలే. వారి ఇగోనే ఈ కథకి ప్రధాన సంఘర్షణ.



చాలాకాలం తర్వాత మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ ఒక సినిమాకి మాటలు అందించిన చిత్ర మిదే. తన దర్శకత్వంలో రూపొందే చిత్రాలకు మాత్రమే ఆయన మాటలు రాస్తున్నారు. కానీ, పవన్ కళ్యాణ్‌తో ఉన్న స్నేహం కారణంగా ఆయన తన కలాన్ని ఝుళిపిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించిన ఈ మూవీలోని పాటలు, ప్రోమోలు అభిమానుల అంచనాలను మరింతగా పెంచాయి.

విడుదల తేదీ: జనవరి 12, 2022.

## రాధేశ్యామ్

ప్రభాస్ ఇప్పుడు జాతీయస్థాయి హీరో. ప్రభాస్‌కున్న క్రేజ్ దేశంలో అతికొద్దిమందికి మాత్రమే ఉంది. ముఖ్యంగా ఉత్తర భారతంలో ప్రభాస్ మేనియా వేరు. రాధేశ్యామ్ నాలుగేళ్లుగా నిర్మాణంలో ఉండి అనేక సార్లు వాయిదాపడ్డా కూడా ఈరోజు ఇంత హంగామా జరుగుతుందంటే కేవలం ప్రభాస్ అనే పేరు. సంక్రాంతి బరిలో దిగిన అతిపెద్ద పాన్ ఇండియా చిత్రం ఇది.

ప్రభాస్ సినిమా అంటేనే భారీతనం. ఇది కూడా దాదాపు 300 కోట్ల రూపాయలతో తెరకెక్కింది. యూరోప్ నేపథ్యంగా సాగే కథ ఇది. జిల్ సినిమా తీసిన రాధాకృష్ణకుమార్ ఈ చిత్రానికి దర్శకుడు.

ప్రభాస్ విక్రమాదిత్య అనే పాత్ర పోషిస్తున్నారు. అరచేయి చూసి అతడు ఎవరి జాతకమైనా ఇట్టే చెప్పగలడు. అతనికి ప్రేరణ అనే ఒక అందగత్తెతో పరిచయం అవుతుంది. అది ప్రేమగా మారుతుంది. కానీ ఆమె జాతకం చూసి షాక్ అవుతాడు విక్రమా దిత్య. ఆమె త్వరలోనే చనిపోతుంది అని గ్రహిస్తాడు. మరి విక్రమాదిత్య ఆమెని బ్రతికించుకొనేందుకు ఏం చేశాడు అనేది కథ.

మాస్ హీరోగా, యాక్షన్ స్టార్‌గా ఇమేజ్ ఉన్న ప్రభాస్ ఒక రోమియో తరహా ప్రేమికుడిగా కనిపిస్తాడు. అందమైన యూరోప్‌లో ఒక అందమైన జంట మధ్య సాగే ఒక అందమైన ప్రేమకథ. పూజాహెగ్డే ఆ అందాల భామ. పాటలు, అందమైన ప్రదేశాలు ఈ సినిమాకి ప్రధాన ఆకర్షణ. హిందీ పాటలకు, తెలుగు పాటలకు



వేర్వేరు సంగీత దర్శకులు పనిచెయ్యడం ఈ సినిమాకు మరో ప్రత్యేకత.

విడుదల తేదీ: జనవరి 14, 2022.

## *బంగార్రాజు*

అక్కినేని కుటుంబానికి చిరకాలం గుర్తుండి పోయే సినిమా... మనం. అక్కినేని నాగార్జున, నాగ చైతన్య, అక్కినేని నాగేశ్వరరావు కలిసి నటించారు. అఖిల్ కూడా అతిథి పాత్రలో మెరిశాడు. ఇప్పుడు మరోసారి నాగార్జున, నాగచైతన్య కలిసి నటిస్తున్నారు.

సోగ్గాడే చిన్నినాయన సినిమాకు ప్రీక్వెల్‌గా రాబో తోన్న బంగార్రాజు చిత్రంతో మరోసారి మనముందుకు వస్తున్నారు. సోగ్గాడే చిన్నినాయన ఐదేళ్ల క్రితం సంక్రాంతికి విడుదలై ఘన విజయం సాధించింది. అదే సెంటిమెంటుతో ఈసారి కూడా సంక్రాంతి బరిలో దిగుతున్నారు నాగార్జున. అయితే, ఇందులో నాగార్జున తోపాటు నాగచైతన్యది కూడా పూర్తిస్థాయి పాత్ర.

అన్ని రకాల కమర్షియల్ అంశాలతో రాబోతోన్న బంగార్రాజు చిత్రంలో నాగార్జున సరసన రమ్యకృష్ణ, నాగచైతన్యకు జోడిగా కృతిశెట్టి కనిపించనున్నారు. కళ్యాణ్‌కృష్ణ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ మూవీ మరోసారి సంక్రాంతి విజేతగా నిలుస్తుందా అన్నది చూడాలి. అనూప్ రూబెన్స్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నాడు.

విడుదల తేదీ: జనవరి 15.

## *ఆచార్య*

ఆర్ ఆర్ ఆర్ సినిమాకి తెలుగు సినిమా రంగం లోనే రూపొందిన అతిపెద్ద మల్టీస్టారర్‌గా పేరు వచ్చింది. ఎన్టీఆర్, రామ్‌చరణ్ ఇద్దరూ సమకాలీన అగ్రహీరోలు. ఆచార్య సినిమాకి కూడా అలాంటి ప్రచారమే ఉంది. కాకపోతే, ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు కథానాయకులు నటించారు. తండ్రీకొడుకులు కలిసి చేసిన భారీ మూవీ ఇది.

చిరంజీవి, రామ్‌చరణ్ కలిసి నటించడం ఒక్కటే ప్రత్యేకత కాదు. అపజయాలు చూడని దర్శకుడిగా పేరొందిన శివ కొరటాల తీస్తున్న చిత్రమిది. అందుకే, దీనిపై భారీ అంచనాలున్నాయి. దాదాపు 150 కోట్ల



రూపాయలతో తెరకెక్కుతోంది. మిగతా పెద్ద సినిమాల్లా ఇది పాన్ ఇండియన్ మూవీకాదు. పక్కా తెలుగు చిత్రమే. కానీ, చిరంజీవి, రామ్‌చరణ్, కాజల్ అగర్వాల్, పూజహెగ్డే, సోనుసూద్ వంటి భారీ తారాగణంతో రూపొందుతోంది. అందుకే, సినిమాపై హైప్ మామూలుగా లేదు.

అంజి తర్వాత చిరంజీవి కెరీర్‌లో ఎక్కువ కాలం నిర్మాణంలో ఉన్న సినిమా ఇదే. దర్శకుడు కొరటాల శివ కూడా ఇప్పటివరకు ఎప్పుడూ ఒకే చిత్రంపై మూడేళ్లు పనిచేయలేదు. కానీ ఈ కథను, సినిమాని ఆయన బలంగా నమ్మారు. ఇప్పటివరకు వచ్చిన అన్ని టీజర్లు, పాటలు అంచనాలు అందుకున్నాయి.

విడుదల తేదీ: ఫిబ్రవరి 4.

## *ఖిలాడీ*

చకచకా సినిమాలు చేసే మాస్ మహారాజ్ రవితేజ నుంచి కొత్త ఏడాదిలో కొత్త సినిమాలు వస్తున్నాయి. అందులో ఒకటి ఖిలాడీ. రవితేజ కెరీర్ లోనే భారీ బడ్జెట్ సినిమాగా వస్తోంది ఖిలాడీ. క్రాక్ వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత మాస్ మహారాజా రవితేజ హీరోగా, రాక్షసుడు వంటి సూపర్‌హిట్ చిత్రాన్ని తెరకెక్కించిన రమేష్ వర్మ దర్శకత్వంలో రూపొందు తోన్న హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. మాస్ రాజా ఇందులో ద్విపాత్రాభినయం చేశాడు.





రవితేజ సరసన మీనాక్షి చౌదరి మెయిన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, డింపుల్ హైతి సెకండ్ హీరోయిన్ రోల్ చేస్తోంది. ఈ హై-ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ కచ్చితంగా ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేస్తుందని అంటోంది యూనిట్. దేవిశ్రీప్రసాద్ సంగీతం ఈ సినిమాకు మరో మేజర్ ఎస్సెట్ కాబోతోంది.

విడుదల తేదీ: ఫిబ్రవరి 11.

## మేజర్

2022లో థియేటర్లలోకి వస్తున్న మరో పాన్ ఇండియా మూవీ మేజర్. *క్షణం, గూఢచారి,* ఎవరు వంటి డిఫ్‌రెంట్ చిత్రాలతో వరుస విజయాలను అందుకున్న అడివి శేష్ టైటిల్ రోల్ పోషించిన చిత్రం ఇది. శశికిరణ్ తిక్క దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని జీఎంబీ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై మహేష్‌బాబు నిర్మిస్తున్నారు. మహేష్‌తోపాటు 'ఏ ప్లస్ఎస్' మూవీస్, సోనీ పిక్చర్స్ కలిసి ఈ సినిమా నిర్మిస్తున్నాయి.

26/11 ముంబయి ఉగ్రవాద దాడుల్లో తన ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలను కాపాడిన ఆర్మీ ఆఫీసర్ మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ జీవితం ఆధారంగా మేజర్ సినిమాను తెరకెక్కిస్తున్నారు. తెలుగు, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా మూవీగా వస్తున్న ఈ సినిమాతో సయీ మంజ్రేకర్ టాలీవుడ్‌కు పరిచయమౌతోంది. ఈ సినిమా కోసం 6 భారీ సెట్స్ వేశారు. వాటిలో ముంబయిలోని తాజ్ హోటల్ సెట్ కూడా ఉంది. 120 అడుగుల ఎత్తులో 5 అంతస్తులుగా ఈ స్టార్ హోటల్ సెట్ వేశారు. ఈ సినిమా కోసం అడివి శేష్ బాగా కష్టపడుతున్నాడు. దాదాపు ఉన్ని కృష్ణన్ లుక్‌లోకి మారిపోయాడు.

విడుదల తేదీ: ఫిబ్రవరి 11.

## ఎఫ్ 3

సూపర్ హిట్టయిన ఎఫ్ 2 సినిమాకు సీక్వెల్‌గా వస్తోంది ఎఫ్ 3 మూవీ. అనీల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేష్, వరుణ్‌తేజ్ హీరోలుగా నటిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. 2022లో థియేటర్లలోకి రాబోతున్న బిగ్ బడ్జెట్ సినిమాల్లో ఇది కూడా ఒకటి. మెహ్రీన్, తమన్న హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాలో డబుల్ ఫన్ ఉంటుందని ధీమాగా చెబుతున్నాడు దర్శకుడు అనిల్ రావిపూడి.

ఎఫ్ 2లో భార్యాభర్తల మధ్య అనుబంధం, గిల్లికజ్జాల్ని సరదాగా చూపించిన అనీల్, సీక్వెల్‌లో డబ్బు కాన్సెప్ట్‌ను సెలక్ట్ చేసుకున్నాడు. అంతేకాదు, హీరోల క్యారెక్టరైజేషన్లు కూడా మార్చాడు. ఈ సినిమాలో వెంకటేష్‌కు రేచీకటి, వరుణ్‌తేజ్‌కు నత్తి. ఈ లోపాలతో సినిమాలో ఫుల్‌గా కామెడీ పండుతుందని చెబుతున్నారు. దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై దిల్ రాజు నిర్మిస్తున్నాడు.

విడుదల తేదీ: ఫిబ్రవరి 18.

## పక్కా కమర్షియల్

ఓవైపు కామెడీని అద్భుతంగా పండించే దర్శకుడు. మరోవైపు యాక్షన్‌ను అంతే అద్భుతంగా పండించే హీరో. ఇలాంటి ఇద్దరు వ్యక్తులు కలిసి సినిమా చేస్తే ఎలా ఉంటుంది? అదే పక్కా కమర్షియల్ సినిమా. దర్శకుడు మారుతి, హీరో గోపీచంద్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకులు చాన్నాళ్లుగా దృష్టిపెట్టారు. మారుతి మార్కు కామెడీతో పాటు గోపీచంద్ మార్క్ యాక్షన్ కోసం ఎదురు చూస్తున్నారు. ఈ సినిమాలో గోపీచంద్ విలక్షణ పాత్రలో కనిపించబోతున్నాడు. తన మార్క్ యాక్షన్‌తో పాటు కామెడీ కూడా పండించబోతున్నాడు. రాశిఖన్నా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో రావు రమేష్, సప్తగిరి కీలక పాత్రలు పోషించారు. జీఏ2 పిక్చర్స్, యూవీ క్రియేషన్స్ బ్యానర్లపై వస్తున్న ఈ సినిమాకు జాక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నాడు.

విడుదల తేదీ: మార్చి 2022.

*(ఇంకా ఉంది)*


క్రిస్మస్ శుభాకాంక్షలు
ఫోటో: శ్రీ అట్లూరి

UNDAVALLI
CONSTRUCTIONS

# PAY 10% NOW

## 0% INTEREST TILL POSSESSION

**668 LUXURY APARTMENTS**

**2 ~~Bhk~~, 3 Bhk, 4 Bhk & 4 Bhk Duplex from**
**1200 SFT – 4160 SFT LUXURY FLATS**

APRERA APPROVED



## JUST A FEW MINUTES DRIVE FROM VIJAYAWADA AND AP SECRETARIAT

Club House / Swimming Pool / Kids Pool / Multi-Purpose Function Hall / Mini Theatre
Amphitheatre / Cafeteria / Well Equipped Gymnasium / Aerobics / Meditation Hall / Jogging Track
Yoga Room / Health Spa / Children's Play Area / Outdoor Cricket Court / Basket Ball Court
Badminton Court / Shuttle Court / Elder Parks / Squash Court / Table Tennis / World Class Sports






Design By CREATIVE ETHICS.COM +91 9032932953 (INDIA)

SRIVALLI
PRAVAS
*Your Heaven on Earth*

# LETS YOUR DREAMS COME TRUE

## on VJA - GNT National Highway at KAZA TOLL PLAZA

Bank Loans Available

+1 314 256 9132 (USA) 88 99 11 8888 (INDIA) sales@ucpl.io www.ucpl.io